ప్రజాశక్తి

బుధవారం 14 ఫిబ్రవరి 2024 8 పేజీలు

ప్రకాశం బాపట్ల

బహిరంగ సభ కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

17న చంద్రబాబు ఇంకొల్లు రాక

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

వైసిపి ప్రభుత్వ పీడిత వర్గాలను ఏకం చేసే లక్ష్యంతో టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు నిర్వహిస్తున్న రా కదలిరా కార్యక్రమంలో భాగంగా ఈనెల 17న ఇంకొల్లులో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తెలిపారు. స్థానిక పావులూరు రోడ్డులో బహిరంగ సభ ఏర్పాటుకు అనువైన స్థలాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ ఈనెల 17న మధ్యాహ్నం 1.30 గంటలకు చంద్రబాబు నాయుడు ఇంకొల్లు రానున్నట్లు వివరించారు.బహిరంగ సభకు పర్చూరు నియోజకవర్గం నుంచి తెలుగుదేశం పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలంతా హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలేరు రామకష్ణ, కరి శ్రీనివాసరావు, ఇండ్ల శ్రీనివాసరావు, టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

16న గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెకు

వామపక్షాల మద్దతు

- హామీలను విస్మరించిన బిజెపి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి
- వామపక్ష పార్టీల పిలుపు
- బంద్‌ను జయప్రదం చేయాలని విజ్ఞప్తి

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా క్యాదర్శి సయ్యద్ హనీఫ్

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

సంయుక్త కిసాన్ మోర్చా, భారత్ కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు ఈనెల 16న నిర్వహిస్తున్న గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెకు వామపక్ష పార్టీలు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు వామపక్ష పార్టీల నేతలు ప్రకటించారు. సిపిఐ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వామపక్ష పార్టీల నేతలు మాట్లాడారు. సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ మాట్లాడుతూ ఐదువందల రైతు సంఘాలు, కార్మిక సంఘాలు దేశవ్యాప్తంగా ఈ బంద్‌లో పాల్గొంటున్నట్లు తెలిపారు. బంద్‌కు వామపక్షపార్టీల తరుపున సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడం లోనూ, కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలోనూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవ హరిస్తుందన్నారు. రైతుల సుదీర్ఘ ఆందోళనలతో నల్లచట్టాలను ఉప సంహరించుకున్న కేంద్రం వాటిని సంపూర్ణంగా రద్దు చేసిన దాఖలాలు లేవన్నారు. వందలాది మంది రైతులపై పెట్టిన కేసులు ఎత్తివేయ లేదన్నారు. బడ్జెట్‌లో వీటిపై చర్చలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. యూరియాపై రూ.62 వేల కోట్ల సబ్సిడీలు ఎత్తివేశారని వివరించారు. ఉపాధి హామీకి రూ. 4052 కోట్ల మేర కోత విధించారని తెలిపారు. దేశావ్యాప్తంగా 50లక్షల పరిశ్రమలను ప్రయివేటికరించే

2లో

గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలి 3లో

ఎమ్మెల్యే ఏలూరికి 41(ఏ) నోటీసు 4లో

రాష్ట్రానికి పట్టిన శనిని వదిలించేందుకు సిద్ధం 8లో

మాగుంట వ్యూహం ఏమిటి?

- బాలినేని భేటీలో టిక్కెట్ లేదని స్పష్టం
- ప్రత్యామ్నాయంపై తర్జనభర్జనలు

ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

సిఎం జగన్‌తో మాజీ మంత్రి బాలినేని సోమవారం నాటి భేటీలో ఎంపీ మాగుంటకు టిక్కెట్ లేదని తేలిపోయింది. ఈ విషయాన్ని బాలినేని కూడా పార్టీనేతలకు స్పష్టం చేశారు. చెవిరెడ్డి భాస్కరెడ్డి ఎంపీ అభ్యర్థిగా ఖరారైనట్లేనని మీడియా ప్రతినిధులు అడిగినపుడు చెప్పారు. బాలినేని కూడా మాగుంట కోసం ఆఖరు నిమిషం వరకూ ప్రయత్నాలు చేసి వదిలేశారు. ఇపుడు ఎంపీ మాగుంట రాజకీయ వ్యూహం ఏమిటి? తన కుమారుడిని ఎంపీగా పోటీ చేయించాలని చాలా కాలంగా యోచిస్తున్న సంగతి తెలిసిందే. ఈ తరుణంలో వైసిపి కాదన్నందున ప్రత్యామ్నాయాలపై ఇక దృష్టిసారించక తప్పదంటున్నారు. ఇప్పటి వరకూ ఆయన వైసిపి అధిష్టానం మనుసు మార్చుకుని టిక్కెట్ ఇస్తుందనే ఆశతో ఉన్నారు. సోమవారం సిఎం జగన్‌తో బాలినేని భేటీ అయ్యారు. అనేక విషయాలు సిఎంతో చర్చించారు. మాగుంట విషయంపై సిఎం ఆలోచనలకు తగ్గట్టుగానే ముందుకు సాగాల్సిన పరిస్థితి వచ్చింది. దీంతో బాలినేని కూడా మాగుంట విషయాన్ని అనివార్యంగా వదిలేయాల్సిన పరిస్థితి వచ్చింది. ఇపుడు మాగుంట రాజకీయ భవితవ్యం పైనే చర్చ సాగుతోంది. ఇప్పటికే టిడిపి అధినేతతో మాగుంట సంప్రదింపుల్లో ఉన్నారనే చర్చ కూడా లేకపోలేదు. వైసిపి టిక్కెట్ ఇవ్వనపుడు ఆయన దారి ఆయన చూసుకోవడంలో ఆశ్చర్యం లేదని వైసిపి నేతల్లో చర్చ సాగుతోంది. టిడిపి నుంచే ఆయన కుమారుడు మాగుంట రాఘవరెడ్డిని బరిలోకి దింపుతారనే అంచనాలు ఉన్నాయి.అయితే టిడిపి అధిష్టానం కూడా ఎంపీ అభ్యర్థిపై వేచి చూస్తోంది. బలమైన నేతలకోసం అన్వేషణ సాగిస్తోంది.ఆర్థిక స్తోమత గల నేతను బరిలోకి దింపాలనే ఆలోచనలో ఉంది. అసెంబ్లీ అభ్యర్థులకు కూడా కొంత ఊరట కలిగేలా ఆలోచిస్తోంది. అందుకే అన్ని అసెంబ్లీస్థానాల్లో ఇన్‌ఛార్జులను అభ్యర్థులుగా ఖరారు చేసింది. ఇప్పటికే వారు తమ నియోజక

2లో

గిరిజన మహిళకు న్యాయం చేయాలని

పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన

- ఐద్వా నాయకులపై పోలీసుల దౌర్జన్యం
- కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్

పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న మహిళలు

ప్రజాశక్తి- కనిగిరి

కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని మాచవరానికి చెందిన గిరిజన మహిళ దాసరి పొట్టమ్మకు న్యాయం చేయాలని, సైకో భర్తను కఠినంగా శిక్షించాలని కోరుతూ ఐద్వా సంఘం ఆధ్వర్యంలో మహిళలు మంగళవారం నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం పోలీసు సర్కిల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఐద్వా మహిళలు మహిళకు న్యాయం కోసం వచ్చిన తమపై సోమవారం రాత్రి కానిస్టేబుల్ నాగేశ్వరరావు అనుచితంగా వ్యవహరించి దాడి చేసినట్లు తెలిపారు. సిసి పుటేజీ పరిశీలించి నాగేశ్వరరావుపై శాఖపరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఈ క్రమంలో సిఐ ఐద్వా మహిళల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పోలీసులకు ఐద్వా మహిళలకు మధ్య తోపులాట జరిగింది. కానిస్టేబుల్ నాగేశ్వరరావు పై చర్యలు తీసుకొని బాధిత గిరిజన మహిళకు న్యాయం చేసే వరకూ కదిలేది లేదని ఐద్వా మహిళలు

2లో

పెండింగ్ పనులు పూర్తి చేయండి

మంత్రి మేరుగ నాగార్జున

మాట్లాడుతున్న మంత్రి నాగార్జున

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

సంతనూతలపాడు నియోజక వర్గ పరిధిలో చేపట్టి, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను, సంక్షేమ పథకాలను వెంటనే పూర్తి చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి మేరుగనాగార్జున అధికారులను ఆదేశించారు.కలెక్టర్ ఛాంబర్‌లో మంత్రి నాగార్జున, కలెక్టర్ దినేష్ కుమార్‌తో కలిసి రెవెన్యూ, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యుఎస్ జిల్లా గ్రామీణాభివృద్ది సంస్థ, సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు, సంతనూతలపాడు నియోజక వర్గ పరిధిలోని తహశీల్దార్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పురోగతి పై శాఖల వారీగా సమీక్షించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని సంతనూతలపాడు నియోజక వర్గ పరిధిలో చేపట్టిన రోడ్లు, డ్రైన్స్ తదితర అభివృద్ధి పనులను పూర్తి చేయాలన్నారు. రెవెన్యూ సమస్యలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని తహశీల్దార్లను ఆదేశించారు. కలెక్టర్ దినేష్ కుమార్ మాట్లాడుతూ నియోజక వర్గ స్థాయిలో అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలులో క్షేత్ర స్థాయి అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి పెండింగ్‌లో వున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సత్వరం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నియోజక వర్గంలో పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ అంశాలకు సంబంధించి వెంటనే ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యుఎస్ శాఖల ఎస్ఇలు కొండయ్య, షేక్ మర్దన్ ఆలీ, డిఆర్‌డిఎ పీడీ టి. వసుంధర, సోషల్ వెల్ఫేర్ డీడీ లక్ష్మా నాయక్, తహశీల్దార్లు, ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నాగరాజుకు అభినందనలు

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో ఈ నెల 8 నుంచి 11 వరకూ 5వ నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున 40 ప్లస్ విభాగంలో బాపట్ల జిల్లాకు చెందిన హెడ్ కానిస్టేబుల్ నాగరాజు పాల్గొని పోల్ వాల్ట్, షర్ట్ పుట్ విభాగాల్లో పతకాలు సాధించాడు. పోల్‌వాల్ట్‌లో స్వర్ణ, షాట్ పుట్‌లో రజత పతకం సాధించాడు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచి మేలో ఆస్ట్రేలియాలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్‌కు ఎంపికయ్యాడు. అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన నాగరాజును ఎస్‌పి వకుల్ జిందాల్ అభినందించారు. మెడల్స్ అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ నాగరాజు పతకాలు సాధించి జిల్లా పోలీస్ ఖ్యాతిని జాతీయస్థాయిలో ఇనుమడింప జేయడం అభినందనీ యమన్నారు. కార్యక్రమంలో ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ మల్లికార్జునరావు పాల్గొన్నారు.

16న గ్రామీణబంద్, పారిశ్రామిక సమ్మెకు

వామపక్షాల మద్దతు

(మొదటిపేజీ తరువాయి)

ప్రయత్నాలు జరుగు తున్నాయన్నారు. బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ శక్తులను బలోపేతం చేస్తూ దేశ సంపదను అంబానీ, ఆదానీలకు దోచిపెడుతుందన్నారు. వ్యవసాయాన్ని సంక్షోభంలోకి నెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపి ప్రభుత్వ హయాంలో 1.52 లక్షల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని చెప్పారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సులు అమలు చేయలేదని పేర్కొన్నారు. వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టి, పారిశ్రామిక రంగాన్ని ప్రయివేటుపరం చేస్తూ కేంద్ర ప్రభుత్వం పైశాచిక ఆనందం పొందుతుందన్నారు. ఈ చర్యలకు నిరసనగా ఈనెల16న నిర్వహిస్తున్న గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా జరిగే బంద్‌లో వామపక్ష శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని మద్దతు తెలపాలన్నారు.బంద్, సమ్మెల్లో రైతులు, కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్.నారాయణ మాట్లాడుతూ రైతుల సమస్యలపై 13 నెలల పాటు జరిగిన సుదీర్ఘ పోరాటం తరువాత మూడు నల్లచట్టాలను రద్దుచేస్తున్నట్లు ప్రకటించిన బిజెపి ప్రభుత్వం రెండేళ్ళ గడిచినా రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లు తెచ్చి కార్మికుల హక్కులను కాలరాస్తున్నారని తెలిపారు. గ్రామీణ బంద్, కార్మిక సమ్మెతో కేంద్రానికి బుద్ధిచెప్పాలిసిన అవసరం ఉందన్నారు. సిపిఐఎంఎల్ (న్యూడెమొక్రసీ) రాష్ట్ర నాయకులు చిట్టిపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెపై నిర్బంధాన్ని ప్రయోగించేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విశ్వప్రయత్నాలు చేస్తుందన్నారు. ఢిల్లీ చుట్టూ కంచెలు వేయడం, బారికేడ్లు పెట్టడం ఆపార్టీ నిరంకుశత్వానికి నిదర్శనమన్నారు. రైతుల కష్టాలను తీర్చేలా బడ్జెట్‌లో ఎలాంటి ప్రతిపాదనలు లేవన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐఎంఎల్ పార్టీ జిల్లా కార్యదర్శి డివిఎన్. స్వామి, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు, సిపిఐ నాయకులు పివిఆర్.చౌదరి, ఆర్.వెంకట్రావు, కొత్తకోట వెంకటేశ్వర్లు, సిపిఎంఎల్ నాయకులు ఎంఎస్.సాయి పాల్గొన్నారు

గిరిజన మహిళకు న్యాయం చేయాలని..

పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన

(మొదటిపేజీ తరువాయి)

పట్టుబట్టారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కనిగిరి పట్టణ కార్యదర్శి పిసి కేశవరావు, ఐద్వా కనిగిరి పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఎస్‌కె బషీరా, ప్రసన్న, నాయకులు ఎలేషమ్మ, వెంకటమ్మ ప్రమీల, చిన్నక్క, శాంతకుమారి, రత్నమ్మ, నారాయణమ్మ, తిరుపతమ్మ, విజయలక్ష్మి, రమీజాబి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, PATHAN KHASIM KHAN, S/o. Pathan Abdulla Khan residence of D.No.10-1056-A, Jagadeeswari Hall Road, Markapur, Prakasam District, 523316, A.P., here by declare that my father name is wrongly entered in my passport bearing No. J7865131, is PATHAN ABDUL KHAN instead of PATHAN ABDULLA KHAN due to oversight, and his correct name is PATHAN ABDULLA KHAN. I here by declare the above particulars are true vide affadavit dated 12-02-2024 before Public Notary, Ongole.

CHANGE OF NAME

I, PATAN MOULABI, (old name) W/o. Pathan Khasim Khan, Residence of D.No.10-1056A, Jagadeeswara Hall Road, Markapur, Prakasam District, 523316, A.P. I have changed my name from PATAN MOULABI to PATAN MARIYAM BI (New Name) W/o. Pathan Khasim Khan. Here after my name is known as PATAN MARIYAM BI as per affidavit dated 12/02/2024 before Public Notary, Ongole.

దావా సమను

మహారాజశ్రీ పర్చూరు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

OS No : 52/2023

Between:-

మందూరి సుబ్బరామయ్య ......వాది

మరియు

మిన్నెకంటి అంజలి .... ప్రతివాది

To

మిన్నెకంటి అంజలి, W/o లేటు శ్రీనివాసరావు మార్టూరు, మార్టూరు మండలం, బాపట్ల జిల్లా,

పై నంబరు గల దావాను మీపై దాఖలు చేసి మీకు ఎన్నిమార్లు దావా సమన్లు పంపినను చేరనందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియ జేయునది ఏమనగా ది.23-02-2024 న ఉ.10-30 ని.లకు వాయిదా ఉన్నందున మీరు స్వయ ముగా గాని వకీలు గారి ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరయి మీ ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేని ఎడల మీపరోక్షము నందు దావాను విచారించి తీర్మా నించబడును.

// కోర్టు వారి అనుమతితో //

వాయిదా తేది : 23-02-2024

ఇట్లు
రావి సత్యనారాయణ
రావి శ్రీనివాసరావు
CH శ్రీరమణి
న్యాయవాదులు, పర్చూరు..

నోటీసు

మహారాజశ్రీ మార్కాపురం 6వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

G.W.O.P.No. 2/2024

మధ్యలో :

బసగానిపల్లి పర్వీన్ ....పిటీషనరు

మరియు

NIL ....రెస్పాండెంట్

పై నెంబరున పిటీషనర్లు మైనర్లు అయిన బసగానిపల్లి అఫ్రీన్, బసగానిపల్లి మెహరీన్లకు గార్డియన్ గా తల్లి అయిన ఆమెను నియమించుచూ మైనర్ల యొక్క విద్య, వైద్య ఖర్చులకు గాను గతంలో పర్వీన్ గారు కొనుగోలు చేసి, వారి మైనరు కుమార్తెలు పేరిట రిజిష్టరు చేయించబడిన సర్వే నెంబరు 3/3, 3/5ల యందలి 155.55 మరియు 155.55చదరపు గజముల స్థలమును మైనర్లు యొక్క సంక్షేమము కొరకు అమ్మి, వాటిని వారి విద్యకు వినియోగించు కొనుటకు గాను పర్మిషన్ కోరుచూ పిటీషను దాఖలు చేయగా సదరు పిటీషను ది 27-02-2024 తేదీకి వాయిదా వేసినారు.కావున మీకు ఎవ్వరికైనా ఎట్టి ఆక్షేపణలు వున్ననూ మీరు పై తేదీన పై కోర్టువారి ఎదుట ఉదయం 10-30 ని॥లకు స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలసియున్నది. లేని యెడల మీ పరోక్షం నందు తీర్మానించబడును అని యందుమూలముగా మీకు తెలియజేయడమైనది.

షెడ్యూలు

ఐటం నెం.1 :- ప్రకాశం జిల్లా, మార్కాపురం డిస్ట్రిక్ట్ రిజిస్ట్రేషన్- కంభం సబ్ రిజిస్ట్రేషన్, బేస్తవారిపేట మండలం, చిట్టిచెర్ల పంచాయితీ, పూసలపాడు మజార, చిట్టిచెర్ల గ్రామం, సర్వే నెం.3/3 & సర్వే నెం.3/5, పూర్తి విస్తీర్ణం య.0-80 సెంట్లు & య.0-78 సెంట్లులో ప్లాటు నెం : 47 & 48 ర్లు, విస్తీర్ణము 155.55 చదరపు గజములు స్థలమునకు హద్దులు :-

తూర్పు : రోడ్డు
దక్షిణం : ప్లాట్ నెంబర్ 46
పడమర : ప్లాటు నెం.29 & 30ర్లు
ఉత్తరం : రోడ్డు

ఈ హద్దులలోని 155.55 చదరపు గజములు స్థలము మాత్రమే.

ఐటం నెం.2 :- ప్రకాశం జిల్లా, మార్కాపురం డిస్ట్రిక్ట్ రిజిస్ట్రేషన్- కంభం సబ్ రిజిస్ట్రేషన్, బేస్తవారిపేట మండలం, చిట్టిచెర్ల పంచాయితీ, పూసలపాడు మజార, చిట్టిచెర్ల గ్రామం, సర్వే నెం.3/3 & సర్వే నెం.3/5, పూర్తి విస్తీర్ణం య.0-80 సెంట్లు & య.0-78 సెంట్లులో ప్లాటు నెం. 60 & 61 ర్లు, విస్తీర్ణము 155.55 చదరపు గజములు స్థలమునకు హద్దులు :-

తూర్పు : జక్కు హరిబాబు గారి ఖాళీ స్థలము
దక్షిణం : ఇతరుల ఖాళీ స్థలము
పడమర : ప్లాటు నెం.49 & 52 ర్లు
ఉత్తరం : రోడ్డు

ఈ హద్దులలోని 155.55 చదరపు గజములు స్థలము మాత్రమే.

వాయిదా తేది : 27-02-2024

ఇట్లు
మామిళ్ళపల్లి రాఘవేంద్రారెడ్డి
న్యాయవాది,
ఒంగోలు, ప్రకాశం జిల్లా.
సెల్ నెంబర్: 9849275163.

మాగుంట వ్యూహం ఏమిటి ?

(మొదటిపేజీ తరువాయి)

వర్గాల్లో పర్యటిస్తున్నారు. ఎన్నికల ప్రచారం మొదలు పెట్టారు. ఎన్నికలే ఎజండాగా పార్టీ కార్యక్రమాలు, ఎజండాలతో ముందుకు పోతున్నారు. ఎంపీ అభ్యర్థి వ్యవహారమే తేల్లేదు. ఇపుడు మాగుంటను పార్టీకిలో తీసుకుంటారా? అనేదీ చూడాలి. జిల్లా నేతలకు ఎలాంటి సమాచారం ప్రస్తుతానికి లేదు. నేరుగా పార్టీ అధినేత చంద్రబాబుతో మాగుంట టచ్‌లో ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. రాష్ట్ర విభజన జరిగినపుడు కాంగ్రెస్‌లో ఉన్న మాగుంట అనివార్యంగా అప్పట్లో తెలుగుదేశం నుంచిఎంపీగా పోటీచేశారు. స్వల్ప మెజార్టీతో ఓడిపోయారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయనకు ఎమ్మెల్సీ ఇచ్చారు. మళ్లీ బాలినేని చొరవతో 2019లో వైసిపిలో చేరారు. ఎంపీగా గెలిచారు. బాలినేని నిన్నా మొన్నటి వరకు ఇద్దరమూ కలిసే పోటీచేస్తామని పదేపదే చెప్పిన సంగతి తెలిసిందే. ఇది జరగలేదు. 2024లో చెరొక పార్టీనుంచి పోటీచేయాల్సిన పరిస్థితి వచ్చింది. బాలినేని భేటీలో టిక్కెట్ లేదని తేలడంతో మాగుంట కూడా తన నిర్ణయం ఏమిటనేది తేల్చుకోవాల్సి ఉంది. ఇప్పటికే మాగుంట తనయుడు రాఘవరెడ్డి జిల్లాలో పలు నియోజకవర్గాల్లో పర్యటించారు. ఎన్నికల వ్యూహాలపైనే చర్చించారు. టిడిపి నుంచి పోటీ చేసినా మద్దతు ఇవ్వాలని తన అనుచరులుగా ఉన్న వైసిపి నేతలను కోరారు. నిజంగా తెలుగుదేశం నుంచి పోటీచేస్తే వైసిపి వర్గాల మద్దతు ఏ మేరకు ఉంటుందనేదీ చూడాలి. ఇక్కడ బాలినేనికి కూడా మాగుంటతో రాజకీయశత్రుత్వం లేదు. ఈ తరుణంలో చెరొకపార్టీ నుంచి పోటీచేస్తే ఇద్దరి మధ్య ఎలాంటి పరిస్థితులు ఉంటాయనేదీ చూడాలి. ఇదిలా ఉండగా ఒంగోలు ఎంపి టిక్కెట్టుపై తెలుగుదేశం కూడా తర్జనభర్జన పడుతోంది. ఇక్కడ బీసీలకు కూడా అవకాశం ఇవ్వాలనే ఆలోచనలో ఉంది. ఇందుకోసం సర్వేలు చేపడుతోంది.యాదవ సామాజికవర్గం నుంచి పోటీపై ఆలోచిస్తున్నారు. పార్టీ అధ్యక్షుడు నూకసాని బాలాజీ కూడా తనకు అవకాశం కల్పించాలని అధిష్టానాన్ని కోరారు.ఈయన పేరు కూడా పరిశీలనలో ఉంది. బయట నుంచి కొందరి పేర్లుతో పార్లమెంట్ అభ్యర్థిగా పోటీకి పెడితే ఎలా ఉంటుందనే దానిపై అభిప్రాయ సేకరణ కూడా చేస్తున్నారు. మాగుంట కూడా ఇప్పటి వరకూ ఎటూ తేల్చకుండా వైసిపి అధిష్టానం కోసం ఎదురు చూస్తున్నందునే తెలుగుదేశం కూడా బీసీలపై దృష్టిసారించింది. ఎంపీ అభ్యర్థి ఎంపికలో తెలుగుదేశం అడుగులు ఎలా ఉంటాయనేదీ చూడాలి. జిల్లా నేతలు మాత్రం అంతా చంద్రబాబు ఇష్ట మంటున్నారు. బలమైన నేతల కోసం ఎదురుచూస్తున్నారు. మాగుంట వచ్చినా తీసుకోవాలనే ఆలోచనలోనే జిల్లా తెలుగుదేశం నేతలున్నారు.

విద్యార్థులకు మాత్రలు పంపిణీ

టంగుటూరు : జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక పేస్ ఇంజనీరింగ్ కళాశాలలోని విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు మంగళవారం పంపిణీ చేశారు. టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, పిహెచ్‌సి సిహెచ్‌ఓ మాతయ్య, హెచ్ఇఒ శ్రీనివాసులు, సిబ్బంది అరుణ, ఝాన్సీ లక్ష్మీబాయి పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింట్ బొమ్మిరెడ్డి శంకర్ రెడ్డి. S/o శేషారెడ్డి రామ్ నగర్ ఒంగోలు అను వారి సంజాయిషీ మేరకు యావన్మందికి తెలియజేయునది నా క్లయింట్ తనఒరిజినల్ సేల్‌డీడ్‌నెంబర్ 2387/ 2008, తేది : 23-7-2023 న గుంటూరు జిల్లా కొరిటపాడు సబ్‌రిజిస్టర్ ఆఫీసులో రిజిస్టర్ కాబడినది. ఒంగోలులో నాక్లయింట్ రామ్‌నగర్ ఎనిమిదో లైన్‌లో ఉన్న గణేష్ నిలయం అపార్ట్ మెంట్ ఫ్లాట్ నెంబర్ 402లో నివాసము ఉండి ఇదే అపార్ట్ మెంట్ ఫ్లాట్ 404లోకి సామాన్లు మార్చుకునే సమయంలో ఒరిజినల్ దాక్యు మెంటు పోయింది ఎంత వెతికినను దొరకలేదు దొరికిన వారు ఈ క్రింది ఫోన్ నెంబర్ గానిచిరునామా గాని తెలియపరచగలరు

ఇట్లు
మామిళ్ళపల్లి రాఘవేంద్రరెడ్డి
అడ్వకేటు, ఒంగోలు
సెల్ : 9849275163

దావాసమను

మహారాజశ్రీ పర్చూరు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

OS No : 52/2016

Between :

దమ్మాలపాటి వెంకట ప్రసాద్ వగైరాలు ... వాదులు

మరియు

వజ్జా సత్యనారాయణ వగైరాలు ... ప్రతివాదులు

To

D1). వజ్జా సత్యనారాయణ,
S/o లేటు శ్రీరాములు, కొనంకి,
మార్టూరు మండలం, బాపట్ల జిల్లా.

పై నంబరు గల దావాను మీపై దాఖలు చేసి మీకు ఎన్నిమార్లు దావా సమన్లు పంపినను చేర నందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియ జేయునది ఏమనగా ది. 21-02-2024 న ఉ.10-30 ని.లకు వాయిదా ఉన్నందున మీరు స్వయముగా గానీ వకీలుగారి ద్వారా గాని పైకోర్టువారి ఎదుట హాజరయి మీ ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేని ఎడల మీ పరోక్షము నందు దావాను విచారించి తీర్మానించ బడును.

// కోర్టు వారి అనుమతితో //

వాయిదా తేది : 21-02-2024

ఇట్లు
రావి సత్యనారాయణ
రావి శ్రీనివాసరావు
CH శ్రీరమణి
న్యాయవాదులు, పర్చూరు

ప్రజాశక్తి

3

బుధవారం 14 ఫిబ్రవరి 2024

జగన్ మహిళా పక్షపాతి: తాటిపర్తి

ప్రజాశక్తి-పెద్దారవీడు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి మహిళా పక్షపాతి అని యర్రగొండపాలెం నియోజకవర్గ వైసీపీ ఇన్‌ఛార్జి తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. పెద్దారవీడు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో బుధవారం 4వ విడత ఆసరా చెక్కుల పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ దేశంలో మహిళా రుణాలను మాఫీ చేసిన ఘనత ఒక్క జగన్‌కే సాధ్యమైందని అన్నారు. నాలుగో విడతగా మండలం లోని పొదుపు మహిళలకు 551 గ్రూపులకు 5,557 లబ్ధిదారులకు రూ.3 కోట్ల 18 లక్షల 23 వేల 227 రూపాయల చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర ఇరిగేషన్ డైరెక్టర్ దుగ్గెంపుడి వెంకటరెడ్డి, ఎంపీపీ బెజవాడ పెద్దగురవయ్య, జెడ్పీటీసీ ఏరువ చలమారెడ్డి, మండల పార్టీ కన్వీనర్ పాలిరెడ్డి కృష్ణారెడ్డి, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు

ప్రజాశక్తి-కనిగిరి

రానున్న వేసవిలో ప్రజలకు నీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ తెలిపారు. మంగళ వారం కనిగిరి పట్టణంలోని ఐదో వార్డులో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు కార్యాచరణ ప్రణాళిక తయారుచేసి ప్రజలకు నీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు ఆయన తెలిపారు. పట్టణంలోని ప్రజలు తమ అవసరాలు నిమిత్తం నీటిని కొనుగోలు చేయకుండా నీటి సరఫరాకు శాశ్వత పరిష్కారం ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ దేవరాజు మున్సిపల్ ఏఈ కోటేశ్వరరావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ షరీపుద్దీన్, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక స్థలం

కేటాయింపు హర్షణీయం: గోన రంజిత్

ప్రజాశక్తి-గిద్దలూరు

గిద్దలూరు పట్టణంలో క్రైస్తవుల కోసం ప్రత్యేకంగా శ్మశానవాటిక కేటాయించడం హర్షించదగ్గ విషయమని క్రిస్టియన్ మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షులు గోన రంజిత్ కుమార్ అన్నారు. గత ప్రభుత్వాలు ఏ మాత్రం చొరవ చూపకున్నప్పటికీ నేటి వైసీపీ ప్రభుత్వం చొరవ తీసుకుని గిద్దలూరు పట్టణంలో క్రైస్తవుల కోసం ప్రత్యేక శ్మశానవాటిక ఏర్పాటుకు చొరవ తీసుకోవడం హర్షించదగ్గ విషయమని అన్నారు. క్రైస్తవ శ్మశానవాటిక ఏర్పాటుకు కృషి చేసిన సీఎం జగన్ మోహన్‌రెడ్డికి, స్థానిక ఎమ్మెల్యే అన్నా రాంబాబుకు ఆయన క్రిస్టియన్స్ తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఎస్‌పిని కలిసిన వైసిపి నాయకుడు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

జిల్లా ఎస్‌పిని సన్మానిస్తున్న గోవిందరెడ్డి

ప్రకాశం జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన పరమేశ్వరరెడ్డిని మంగళ వారం ఒంగోలులోని ఎస్పీ కార్యాలయంలో యర్ర గొండపాలేనికి చెందిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైసీపీ ఓసీ యూత్ ప్రెసిడెంట్ గోవిందరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువలు, బొకేలతో ఘనంగా సత్కరించారు. జిల్లాలో శాంతి భద్రత ల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.

పంచాయతీ కార్యాలయం సందర్శన

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండలంలోని మైనంపాడు గ్రామ పంచాయతీని నూతనంగా ఎంపిడిఒగా బాధ్యతలు స్వీకరించిన ఎం శ్రీహరి, ఈవోఆర్డీ జి రామకృష్ణ మంగళ వారం సందర్శించారు. ఈ సందర్భంగా పంచాయతీలో ప్రస్తుతం జరుగుతున్న పథకాలు, క్యాస్ట్ సర్వే, ఆరోగ్యశ్రీ కార్డులు, ఆయుష్మాన్ భారత్ కార్డులు పంపిణీ, ఈకేవైసీల మీద వాలంటీర్లకు, సచివాలయ సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఆయా పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దారా వెంకట్రావు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలి

రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

రైతు, వ్యవసాయ కార్మిక, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీన గ్రామీణ భారత్ బందును జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ప్రభాకరరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి రైతు సంఘం నాయకులు అందే నాసరయ్య అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, చేపట్టిన దుర్మార్గపు పద్ధతులను తిప్పికొట్టడానికి ఈ నెల16వ తేదీన దేశవ్యాప్తం గా గ్రామీణ భారత్ బంద్, పారిశ్రామిక సమ్మె జరుగుతున్నా యని, వాటిని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా స్వామినాథన్ కమిషన్ సిఫారసుల మేరకు రైతులకు 50 శాతం రుణ సదుపాయాలను, మద్దతు ధరలను ప్రకటించలేదన్నారు. నాలుగు లేబర్ కోడ్‌ల పేరుతో కార్మిక వర్గాన్ని వీధిన పడేశారన్నారు. స్కీం వర్కర్లకు కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని, వ్యవసాయ కార్మికులకు కనీస వేతనం రోజువారీగా రూ.600 ఇస్తూ, 200 రోజుల పని కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిలబడాలని పిలుపు నిచ్చారు. విద్యుత్ సవరణ బిల్లులను, స్మార్ట్ మీటర్లను పెట్టే పద్ధతిని మానుకోవాలని డిమాండ్ చేశారు. వెలుగొండ ప్రాజెక్టుకు కావలసిన నిధులను కేటాయించి నిర్వాసితులను ఆదుకోవాలని, ప్రాజెక్టు పూర్తి చేయాలని కోరారు. భూ హక్కు ల చట్టాన్ని రద్దు చేయాలని, అటవీ హక్కుల చట్టాన్ని రద్దు చేయాలనే ఆలోచనను విరమించుకోవాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న జామాయిల్, సుబాబుల్ పంటలకు మద్దతు ధరను ప్రకటించాలని, ఈ సందర్భంగా జరిగే సమ్మెలో, గ్రామీణ బందులో ప్రజలందరూ అధిక సంఖ్యలో పాల్గొనా లని కోరారు. సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు చుండూ రు రంగారావు మాట్లాడుతూ ఢిల్లీ రైతాంగానికి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, రైతులకు అవసరమైన మద్దతు ధరను ప్రకటించాలని, రైతు చట్టాలను మార్పు చేసే ఆలోచనను మానుకోవాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం నేత పమిడి వెంకట్రావు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం మోసపూరితమైన మాటలు చెప్పుకుంటూ కాలం గడుపుతోందన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గుమ్మా బాలనాగయ్య, రైతు సంఘం నాయకులు దుగ్గెంపూడి తిరుపతిరెడ్డి, జి రాజశేఖం రెడ్డి, రేపని తిరుపతయ్య, పిల్లి కొండయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు తురగా ఏడుకొండలు, డీకేఎం రఫీ, పేరు వేణు, డి సోమయ్య, ఏ వెంకటేశ్వరరెడ్డి, జమ్ముల నాగ రాజు, ఏఐటీయూసీ నాయకులు షేక్ ఖాసిం పాల్గొన్నారు.

'రా కదలిరా' సభను విజయవంతం చేయాలి: బిఎన్

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మాట్లాడుతున్న బిఎన్ విజయకుమార్

ఒంగోలులోని టిడిపి సంతనూతలపాడు నియోజకవర్గ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌ఛార్జి బిఎన్ విజయ్ కుమార్ మంగళవారం కార్యకర్తలతో సమాయత్త సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో విజయ్ కుమార్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఈనెల 17వ తేదీన ఇంకొల్లులో జరపతలపెట్టిన 'రా కదలిరా' సభను ప్రతిష్టాత్మకంగా తీసుకుని జయప్రదం చేయాలని కోరారు. ప్రతి మండలం నుంచి అధిక సంఖ్యలో తెలుగుదేశం పార్టీ శ్రేణులు, అభిమానులు పాల్గొనాలని అన్నారు. బుధ గురు వారాలలో అన్ని మండలాల్లో 'రా కదలిరా' సమాయత్త సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు చౌటా శ్రీనివాసరావు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి అడకా స్వాములు, మండల, టౌన్ పరిశీలకులు వైవి సుబ్బారావు, మంత్రి శ్రీనివాసరావు, పోలవరపు వెంకటరామయ్య, కొఠారి నాగేశ్వరావు, నాలుగు మండలాల, టౌన్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గొట్టిపాటి రాఘవరావు, మద్దినేని హరిబాబు, గొల్లపూడి సుబ్బారావు, మండవ జయంత్ బాబు, తేళ్ల మనోజ్ కుమార్, మండల ప్రధాన కార్యదర్శులు అవనిగడ్డ శేషయ్య, వేల్పుల శ్రీనివాసరావు, రామలింగయ్య, కాకర్ల లక్ష్మీ వరప్రసాద్, తన్నీరు శ్రీనివాసరావు, రావులపల్లి సురేష్‌బాబు పులిపాటి పంతులు, మండవ గోపి, నల్లగట్ల సుబ్బారావు పాల్గొన్నారు.

బాబు ష్యూరిటీతోనే రాష్ట్ర అభివృద్ధి

కందుల తనయుడు విఘ్నేష్

ప్రజాశక్తి-పొదిలి

బాబు ష్యూరిటీ-భవిషత్‌కు గ్యారంటీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని మార్కాపురం మాజీ ఎమ్మెల్యే తనయుడు కందుల విఘ్నేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం కందుల విఘ్నేష్ రెడ్డి ఆధ్వర్యంలో పొదిలి పట్టణంలో 2వ వార్డులో "బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ" కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు హారతులు, పూలదండలు, శాలువాలతో ఆహ్వానించారు. రాష్ట్రంలో అవినీతి అక్రమాల పాలనతో అభివృద్ధి కుంటుపడిందన్నారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ తెలుగుదేశం పార్టీ సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. నలభై సంవత్సరాలు విలువలతో కూడిన రాజకీయాలకు పెట్టింది పేరు చంద్రబాబు నాయుడు అని, అటువంటి నాయకుడిని అక్రమంగా కేసులో ఇరికించి ఇబ్బంది పెట్టిన ఈ ప్రభుత్వం త్వరలో పతనం అవుతుంద న్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు కాటూరి వెంకట నారాయణ బాబు, గునుపూడి భాస్కర్, కాటూరి నారాయణ ప్రతాప్, ఆవులూరి యలమంద, ముల్లా ఖుర్దూస్, యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, షేక్ రసూల్, జ్యోతి మల్లికార్జున, షేక్ మస్తాన్ వలి, కాటూరి శ్రీను, షేక్ షబ్బీర్, పోపూరి నరేష్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అప్రెంటీస్ విధానం తేవడం దుర్మార్గం: యుటిఎఫ్

ప్రతుల దహనం

ప్రజాశక్తి-పొదిలి: ఉపాధ్యాయ నియామకాలలో మరలా దుర్మార్గమైన అప్రెంటీస్ విధానాన్ని ప్రవేశపెట్టడం మంచి పద్ధతి కాదని, ప్రభుత్వం వెంటనే ఈ అప్రెంటీస్ విధానాన్ని రద్దు చేయాలని యుటిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఉద్యోగ శాఖలో లేని వెట్టిచాకిరీ విధానాన్ని మరలా ప్రవేశపెట్టడం దుర్మార్గమని పేర్కొన్నారు. ఇందుకు నిరసనగా డిఎస్‌సి నియామక ప్రతులను స్థానిక యుటిఎఫ్ భవనం వద్ద దహనం చేశారు. ఉపాధ్యాయుల నియామకాలలో అన్ని ఉద్యోగాల లాగా నేరుగా నియామకం పొందే విధంగా ఉంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం యుటిఎఫ్ పొదిలి డివిజన్ డివిజన్ కార్యదర్శి పి బాల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు అబ్దుల్ హై, పొదిలి మండల ప్రధాన కార్యదర్శి పి వెంకటేశ్వర్లు, కొనకనమిట్ల ప్రధాన కార్యదర్శి కామేశ్వరరావు, కొనకనమిట్ల గౌరవ అధ్యక్షులు యుద్ధం శ్రీనివాసులు, సీనియర్ నాయకులు చవళం వెంకటేశ్వర్లు, సంజీవరావు కాసు తిరుపతిరెడ్డి, తాళ్లూరు చిన్న బాబూరావు సుదర్శన్‌రెడ్డి, టీ నర్సింహారావు, శివారెడ్డి, వై గురవయ్య, సురేష్, సాల్మన్ మొదలగువారు పాల్గొన్నారు.

బీహార్ వాసి రమేష్ సుహాని అదుపులో తీసుకున్న పోలీసులు

గంజాయి చాక్లెట్లు పట్టివేత

ప్రజాశక్తి-చీమకుర్తి

మండలంలోని బూదవాడ గ్రామ పంచాయతీ పరిధిలో గంజాయి చాక్లెట్లు అమ్ముతున్న బీహార్‌కు చెందిన రమేష్ సుహాన్‌ను పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. మంగళవారం జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ముందుగా అందిన సమాచారం మేరకు బూదవాడ పంచాయతీ పరిధిలో దాడులు నిర్వహించారు. బీహార్‌కు చెందిన రమేష్ సుహాన్ వద్ద 540 గంజాయి చాక్లెట్లు పట్టుకు న్నారు. వాటి బరువు 3.480 కిలోలు ఉంటుంది. దాని విలువ దాదాపు రు.10 వేలు ఉంటుందని అంచనా వేశా రు. ఈ సందర్భంగా ఎస్ఇబి సిఐ మారయ్య మాట్లాడు తూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు ఎవరైనా పాల్పడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రానైట్ ప్రాంతంలో నిరంతరం నిఘా పెంచినట్లు తెలిపారు. ఎవరైనా మాదక ద్రవ్యాలు అమ్మితే తమకు తెలియపరచాలని, వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని అన్నారు. దాడులలో ఎస్ఐ వినితారెడ్డి, హెడ్ కానిస్టేబుల్ యూసఫ్ షరీఫ్, కానిస్టేబుల్స్ రామిరెడ్డి, బాల సుబ్రహ్మణ్యం, సురేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాఠశాలలో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-కంభం రూరల్

మండలంలోని ఎల్ కోట ప్రాథమిక పాఠశాలను ఉర్దూ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ షేక్ మొయినుద్దీన్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల అభివృద్ధి, ఉపాధ్యాయుల పనితీరుపై హర్షం వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజనాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఉర్దూ డిఐ మొయినుద్దీన్‌ను ఉపాధ్యాయులు, చిన్నారులు శాలువాతో ఘనంగా సన్మానించారు.

ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరాలి

ప్రజాశక్తి-వెలిగండ్ల

మాట్లాడుతున్న ఎంపీపీ మహాలక్ష్మి

ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరే విధంగా అధికారులు చొరవ తీసు కోవాలని ఎంపీపీ రామన మహాలక్ష్మి అన్నారు. మంగళవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలకు చేరే విధంగా సిఎం జగన్మోహన్‌రెడ్డి ప్రజల శ్రేయస్సు పరమావధిగా పని చేస్తున్నారని అన్నారు. రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని త్వరితగతంగా చర్యలు చేపట్టాలని, నీటి ఎద్దడి అధిగమించాలని అధికారులు ప్రజల సమస్యలపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ, సింగిల్ విండో అధ్యక్షులు కాకర్ల వెంకటేశ్వర్లు, ఎంపీటీసీలు, పలువురు సర్పంచులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలు కూల్చివేత

ప్రజాశక్తి-సిఎస్ పురం

సిఎస్‌పురంలో ఆక్రమించుకొని నిర్మిస్తున్న కట్టడాలను అధికారులు మంగళవారం కూల్చివేశారు. గ్రామంలోని సర్వే నంబర్ 147/1లో ఉన్న వందల ఎకరాల భూమిని కొంతమంది ఆక్రమించుకొని కట్టడాలు నిర్మించుకొంటున్నారు. దీనిపై స్థానిక సర్పంచ్ అనేకసార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లడం జరిగింది. దీనిపై ప్రస్తుతం హైకోర్టులో స్టే ఉన్నప్పటికీ అక్రమ కట్టడాలు ఆగలేదు. ఇటీవల కనిగిరి ఆర్డీఒ జాన్‌ఇర్విన్ ఆక్రమిత భూమిని పరిశీలించి అక్రమంగా నిర్మించిన కట్టడాలు తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. వారి ఆదేశాల మేరకు సిఎస్ పురం విఆర్ఒ మనోజ్ అక్రమంగా నిర్మించిన కట్టడాలు జెసిబితో తొలగించినట్లు మనోజ్ తెలిపారు. ఆయన వెంట విఆర్ఎలు మస్తాన్ ఉన్నారు.

పాత కక్షల నేపథ్యంలోనే సుమంత్ హత్య

• 12మంది నిందితుల అరెస్ట్ • వివరాలు వెల్లడించిన డిఎస్‌పి వెంకటేశులు

ప్రజాశక్తి - బాపట్ల

పాత కక్షల నేపథ్యంలో గోరంట్ల వెంకట సుమంత్ హత్య జరిగినట్లు డిఎస్పి వెంకటేశులు తెలిపారు. రూరల్ స్టేషన్లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రౌడీ షీటర్‌గా ఉన్న రాహుల్ తేజ, అతని స్నేహితులు సోను, వెంకట్ సుమంత్‌లు గ్రూపుగా ఏర్పడి పట్టణంలో అనేకసార్లు వివాదాలకు పాల్పడ్డారని అన్నారు. పాత కేసుల్లో ఉన్న రాహుల్ పోలీసులకు దొరకకుండా తిరుగుతున్న నేపథ్యంలో హత్య కేసులో ప్రధాన ముద్దాయిగా ఉన్న వినోద్ రాహుల్ తేజ గురించి పోలీసులకి సమాచారం ఇచ్చి పట్టించారనే కోపంతో వినోద్‌పై రాహుల్ తేజ కోపం పెంచుకున్నాడని డిఎస్పి తెలిపారు. సోను అనే యువకుడు బాపట్ల విజయకృష్ణ సినిమా థియేటర్ వద్ద ఇరువురిని కత్తితో పొడిచిన సందర్భంలో టివి రిపోర్టర్‌గా ఉన్న యాసీన్, సోనుపై న్యూస్ పోస్ట్ చేశాడనే విషయాన్ని మనసులో పెట్టుకొని యాసీన్ మీద కక్ష పెంచుకున్నారు. యాసీన్, వినోద్‌పై కక్ష పెంచుకున్న రాహుల్ తేజ, సోను ఈనెల 6న మధ్యాహ్నం సమయంలో జిబిసి రోడ్డులోని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర వద్ద యాసీన్ కనిపించడంతో ఇరు గ్రూపుల మధ్య వాగ్వివాదం చేసుకొని ఒకరినొకరు చంపుకుంటామని బెదిరించుకున్నారని అన్నారు. అదేరోజు రాహుల్ తేజ, సోను, సుమంత్ అతని స్నేహితులు కలిసి సూర్యలంక రోడ్డులోని పందెంకోడి రెస్టారెంట్ వద్ద బిర్యాని తింటుండగా వినోద్, యాసీన్ వాళ్ళ దగ్గర బంధువులైన టాక్సీ డ్రైవర్లు కలిసి రాహుల్ తేజ, సోను, సుమంత్‌లపై కర్రలతో, కత్తులతో దాడి చేయడంతో రాహుల్ తేజ, సోను పారిపోగా సుమంత్ దొరికిపోవడంతో కర్రలతో కొట్టి, వినోద్ కత్తితో సుమంత్‌ను పొడిచి హత్య చేసినట్లు డిఎస్పి తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి సూర్యలంక రోడ్డులోని చింతావారిపాలెం అడ్డరోడ్డు వద్ద వినోద్, యాసిన్, సతీష్, అఖిల్, చిన్న వినోద్, ప్రవీణ్ బాబు, దాసు, శివసాయి, బాబు, మహేష్, అశోక్‌ను అరెస్టు చేసి కోర్టుకి హాజరు పరిచామని అన్నారు. 12వ ముద్దాయి దానియేలును అరెస్టు చేయాల్సి ఉందని అన్నారు.

రౌడీ షీటర్ల పై నిఘా

నిత్యం వివాదాలకు పాల్పడుతూ అల్లర్లు చేసే రౌడీషీటర్లపై పోలీస్ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసిందని డిఎస్పి వెంకటేశులు చెప్పారు. చాలామంది రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ చేస్తూ వస్తున్నామని అన్నారు. చాలా మంది మార్పు చెంది కుటుంబ సభ్యులతో మంచిగా జీవితం గడుపుతున్నారని అన్నారు. రాత్రి సమయంలో యువకులు రహదారులపై తిరిగితే స్టేషన్ కు తరలించి తల్లి తండ్రులను పిలిపించి కౌన్సిలింగ్ చేసి పంపిస్తామని అన్నారు. అత్యవసర పరిస్థితుల్లో బయటకు వచ్చేవారు ఆధార్ కార్డు, ఏదైనా గుర్తింపు కార్డు తీసుకొని మాత్రమే రాత్రి సమయాల్లో బయటకు రావాలన్నారు.

30 పోలీస్ యాక్ట్ అమలు

సబ్ డివిజన్ పరిధిలో 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉందని డిఎస్పి వెంకటేశులు పేర్కొన్నారు. తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకుని సభలు, సమావేశాలు జరుపుకోవాలని అన్నారు. సమావేశంలో ట్రైనింగ్ డిఎస్పి శ్రీవిద్య, సిఐ హజరత్ బాబు, రూరల్ సిఐ శ్రీహరి, ఎస్ఐ రవి శంకరరెడ్డి పాల్గొన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి వెంకటేశులు

వైద్య శిబిరంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని పెద్దపులివర్రు గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని సర్పంచి నేల ఉషారాణి రమేష్ ప్రారంభించారు. ఎంపీపీ డివి లలితకుమారి మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష శివిరం ద్వారా పేద బడుగు బలహీన వర్గాల వారికి వైద్యం అందుబాటులోకి వచ్చిందని అన్నారు. డాక్టర్ సిహెచ్ రామలక్ష్మి ఆధ్వర్యంలో స్పెషలిస్టులు 300మందికి పైగా వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఒ మల్లికార్జునరావు, కార్యదర్శి జోజి, నాయకులు మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

చెక్కులు అందజేస్తున్న హనిమిరెడ్డి

వైఎస్ఆర్ ఆసరా సంబరాలు

ప్రజాశక్తి - మేదరమెట్ల

కొరిశపాడు మండలంలో డ్వాక్రా మహిళలకు 4వ విడత వైస్సార్ ఆసరా చెక్కులను 1071సంఘాల్లో 10557మంది సభ్యులకు మేదరమెట్ల మార్కెట్ యార్డ్ నందు వైసిపి ఇంచార్జ్ పాలెం అనిమిరెడ్డి అందజేశారు. సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి నవరత్నాల్లో భాగంగా మేనిఫెస్టోలోని అన్ని పథకాలను నెరవేర్చారని తెలిపారు. అందుకే మరోసారి జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకుంటే రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందుతుందని అన్నారు. కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యులు టి వెంకటరమణ, సర్పంచ్ బునిగల ఎలిసెమ్మ,ఇరుగు పొరుగు గ్రామాల సర్పంచులు, ఏపిఎం బి అనురాధ, సీసీలు వై సాంబయ్య, మస్తాన్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఏలూరికి 41 (ఏ) నోటీసు

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

టిడిపి బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు పోలీసులు 41 (ఏ) నోటీసు అందజేశారు. మార్టూరు అర్బన్ సిఐ ఎస్వి రాజశేఖరరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం గత నెల 30న గ్రానైట్ పరిశ్రమల్లో తనిఖీలు నిర్వహించడానికి వచ్చిన మైనింగ్ విజిలెన్స్ అధికారుల విధులకు ఆటంకం కలిగించారని, గ్రానైట్ పరిశ్రమ యజమానులతో పాటు ఎంఎల్ఏ ఏలూరి సాంబశివరావుపై ఇచ్చిన ఫిరాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇసుకదర్శిలోని ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో విచారణకు సహకరించాలని కోరుతూ నోటీసు అందజేసినట్లు తెలిపారు.

టిడిపి ఉపాధ్యక్షుడిగా 'పిట్టు'

ప్రజాశక్తి - చెరుకుపల్లి

టిడిపి బాపట్ల పార్లమెంట్ ఉపాధ్యక్షునిగా మాజీ జడ్పిటిసి పిట్టు శ్రీనివాసరెడ్డి నియమితులయ్యారు. ఎంఎల్ఎ అనగాని సత్య ప్రసాద్ సిఫారసు మేరకు శ్రీనివాసరెడ్డిని నియమించారు. తన నియామకం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. టిడిపి నాయకులు మల్లాది రామకృష్ణ, పూషడపు కుమారస్వామి, దివి రాంబాబు, కందుల వెంకటేశ్వరరావు అభినందించారు.ద

ఎస్‌సి,ఎస్‌టి సబ్ ప్లాన్ నిర్వీర్యం

ప్రజాశక్తి - మద్దిపాడు

వైసిపి పాలనలో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిర్వీర్యమైందని టిడిపి మండల అధ్యక్షులు మండవ జయంత్ బాబు అన్నారు. మన ఊరు, మన తెలుగుదేశం కార్యక్రమం గార్లపాడులో మంగళవారం నిర్వహించారు. టిడిపి కార్యదర్శి ముత్తనపల్లి రామలింగయ్య, ఎం వెంకట సుబ్బయ్య, కోటు వెంకటేష్, దాసరి హరికృష్ణ, చిన మస్తాన్, తాళ్ళూరి మధు, కోటు కోటయ్యపాల్గొన్నారు.

ఖోఖోలో 'పంగులూరు'కు ప్రథమ స్థానం

ప్రజాశక్తి - పంగులూరు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల్లో పంగులూరుకు చెందిన ఖోఖో బాలుర జట్టు రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించింది. విశాఖపట్నంలో రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు సోమవారం రాత్రి నిర్వహించారు. పంగులూరు సచివాలయం1 జట్టు గెలుపొందినట్లు రాష్ట్ర ఖోఖో కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి తెలిపారు. సచివాలయం స్థాయి, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో ఆడి వరుస విజయాలతో రాష్ట్రస్థాయికి జట్టు చేరుకుంది. రాష్ట్రస్థాయిలో ఉత్కంఠగా జరిగిన పోటీలో అనకాపల్లి జట్టుపై విజయం సాధించి, ప్రథమ బహుమతిని సాధించారు. ఈ జట్టు రాష్ట్ర సిఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేతుల మీదుగా రూ.5లక్షలు నగదు బహుమతి అందుకొన్నట్లు సీతారామిరెడ్డి తెలిపారు. రాష్ట్రస్థాయిలో జరిగిన పోటీలో విజయం సాధించి బహుమతి గెలుచుకున్న ఖోఖో జట్టును గ్రామ ప్రజలు, పెద్దలు అభినందిస్తున్నారు.

ఖోఖోలో ప్రథమ స్థానం సాధించిన పంగులూరు జట్టు

సదస్సులో లెక్చరర్ కె శ్రీనివాసరావు

క్లౌడ్ కంప్యూటింగ్‌పై అవగాహన

ప్రజాశక్తి - వేటపాలెం

స్థానిక సెయింట్ ఆన్స్ ఇంజినీరింగ్ కాలేజీలో క్లౌడ్ కంప్యూటింగ్, వర్చనాలిటీ డెవలప్మెంట్‌పై అతిథి ఉపన్యాసం నిర్వహించినట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన సొల్యూషన్ ఆర్కిటెక్ట్, ఎసెంచర్ ప్రతినిధి కె శ్రీనివాసరావు మాట్లాడారని ప్రిన్సిపాల్ ఎం వేణుగోపాలరావు తెలిపారు. సర్వర్లు, డేటా స్టోరేజ్, నెట్వర్కింగ్, సాఫ్ట్వేర్లు, ఎనాలిసిస్, ఇంటలిజెన్స్ పై అవగాహన కల్పించారు. ఇంటర్నెట్, క్లౌడ్ కంప్యూటింగ్ ఉపయోగించి ఎనాలిసిస్ ఎలా చెయ్యాలో వివరించారు.

కల్తీ పాల కేంద్రాలపై దాడులు

ప్రజాశక్తి - సంతమాగులూరు

మండలంలోని ఏల్చూరులో పాల కేంద్రాలపై విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్, ఫుడ్ సేఫ్టీ అధికారులు మంగళవారం మెరుపు దాడి చేశారు. ఈ దాడిలో గ్రామానికి చెందిన మందాశంకర్ పాల కేంద్రాన్ని తనిఖీ చేశారు. సేకరించిన పాల్లో కల్తీ జరిగినట్లు నిర్ధారించారు. పాల కేంద్రం నుండి డైరిరికి వెళుతున్న 9పాల క్యాను లోని 320లీటర్ల పాలను నిలిపి నమూనాలు సేకరించారు. అనుమానంతో మందా శంకర్ ఇంటి వద్దకు వెళ్లగా కల్తీ చేసే సామాగ్రి అయిన బ్లండర్ ఎలక్ట్రికల్ మిషన్, సన్ ఫ్లవర్ ఆయిల్, పామాయిల్, ఎస్ఎమ్ఎఫ్ పౌడర్ స్వాధీనం చేసుకుని మందా శంకర్, అతని అనుచరులపై కేసు నమోదు చేసినట్లు ఎన్ ఫోర్స్ మెంట్ సిఐ శ్రీహరి రావు తెలిపారు. సేకరించిన 5కిలోల ఎస్ఎమ్ఎఫ్ పౌడర్, సన్ ఫ్లవర్ ఆయిల్ ప్యాకెట్లు 35, పామాయిల్ నూనె ప్యాకెట్లు 61 సీజ్ చేసి హైదరాబాద్ మిల్క్ టెస్టింగ్ కార్యాలయానికి పంపుతున్నట్లు ఫుడ్ ఇన్స్ పెక్టర్ ప్రణీత్ కుమార్ తెలిపారు. ఉన్నతాధికారుల సూచన మేరకు కల్తీ పాల పై ఏల్చూరులో తనిఖీలు చేసినట్లు తెలిపారు. ఎస్ఐ పి సురేష్, వీఆర్ఒ మహర్షి పాల్గొన్నారు.

పోలీసులు స్వాధీనం చేస్తున్న కల్తీ పదార్థాలు

అశోక్‌బాబు వ్యాఖ్యలకు టిడిపి ఖండన

ప్రజాశక్తి - కొల్లూరు

వైసిపి ఇన్చార్జి వరుకూటి అశోక్ బాబు వ్యాఖ్యలను టిడిపి మండల అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కనకాల మధుసూధన ప్రసాద్ ఖండించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అశోకు బాబు మతి భ్రమించి మాట్లాడుతున్నాడని అన్నారు. టిడిపి పెత్తందారుల పార్టీ అనడం సమంజసం కాదని అన్నారు. పెద్దపెద్ద ప్యాలెస్‌లు కట్టుకున్న జగన్మోహన్‌రెడ్డి పెత్తందారుడా? పేదల కోసం పనిచేసిన చంద్రబాబు పెత్తందారుడా ఆలోచించాలని కోరారు. పోలవరం ప్రాజెక్ట్ ని 70శాతం చంద్రబాబు పూర్తి చేస్తే జగన్మోహన్ రెడ్డి రివర్స్ టెండరింగ్ పేరుతో ఆటకెక్కించాడని అన్నారు. మధుసూధన ప్రసాద్ మాట్లాడుతూ అశోక బాబు మాటలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. నక్క ఆనందబాబు కూడా పెత్తందారుడని అనడం సమంజసం కాదని అన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. తప్పుడు వ్యాఖ్యలు మానుకోవాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు రాఘవరావు, దూళిపూడి కృష్ణ, గొరిగపూడి ప్రసాద్, గుర్తుకొండ జ్ఞానేంద్ర భగవాన్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టిడిపి నాయకులు

వైసీపీ కార్యకర్తలతో అశోక్ బాబు

కార్యకర్తలతో అశోక్‌బాబు సమీక్ష

ప్రజాశక్తి - వేమూరు

అమర్తలూరు మండలం కూచిపూడిలో వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్ బాబు తన నివాసగృహంలో కొల్లూరు మండలం క్రాప గ్రామానికి చెందిన కార్యకర్తలతో సమీక్షించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల అమలు తీరు, రాను ఎన్నికల్లో వైసీపీ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చేయాలని సూచించారు. ప్రస్తుతం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరో సారి జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రి కావాలని అన్నారు. తొలిత చుండూరు మండలం మండూరులో జరిగిన ఆరోగ్య సురక్ష శిబిరంలో అశోక్ బాబు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

ప్రజాశక్తి - వేటపాలెం

216 జాతీయ రహదారిపై పందిళ్లపల్లి వద్ద అక్రమంగా తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను ఎస్ఐ జి సురేష్ స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ఇసుక ట్రాక్టర్లను స్టేషన్ తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

మంత్రి నాగార్జునను కలిసిన డిఎస్‌పిలు

ప్రజాశక్తి-సంతనూతలపాడు

నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఒంగోలు డిఎస్‌పి కిషోర్‌బాబు, మార్కాపురం డిఎస్‌పి బాలసుందరరావు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి, వైసిపి సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి మేరుగ నాగార్జునను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పూల బొకేలు ఇచ్చి అభినందనలు తెలిపారు.

మంచినీటి సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

మండలంలోని అన్ని గ్రామాల్లో మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని సిపిఐ మండల కార్యదర్శి ఎం విశ్వరూపాచారి, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు పి తిరుమలయ్య తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఎంపిడివో నాసర్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ముఖ్యంగా తిమ్మాపురం, బోడేనాయక్ తండా, చిన్నదోర్నాల, చింతల అగ్రహారం, రామచంద్రకోట ప్రజలు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ప్రజల సమస్యలను దృష్టిలో పెట్టుకొని నీటి సమస్యను పరిష్కరించాలని వారు కోరారు.

'కంది'కి మార్కెట్ ధర ప్రకారం చెల్లిస్తాం

రాష్ట్ర పౌరసరఫరాల ప్రొక్యూర్‌మెంట్ మేనేజర్ జి శిరీష

ప్రజాశక్తి-పొదిలి

కంది రైతులు పండించిన పంటకు మార్కెట్ ధరతో సమానంగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో ధర చెల్లిస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కేంద్ర కార్యాలయ ప్రొక్యూర్‌మెంట్ మేనేజర్ జి శిరీష అన్నారు. మంగళవారం మండలంలోని పాములపాడు గ్రామంలో ఇటీవల నూతనంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, కందులను బయట అమ్ముకోవద్దని సూచించారు. బయట మార్కెట్‌లో ఎంత ధర ఉందో అంతే ధరకు రైతుల వద్ద కొనుగోలు చేసిన వాటికి చెల్లిస్తామన్నారు. మన ప్రభుత్వం ప్రతి రోజూ మార్కెట్లో గిట్టుబాటు ధరను పరిగణలోకి తీసుకుని ఆ ధరకే రైతుల వద్ద నుంచి కందులు కొనుగోలు చేస్తోందని తెలిపారు. రైతులు కందులు కొనుగోలు కేంద్రంలో అమ్మిన ఒకటి రెండు రోజుల్లో మీ అకౌంట్లో డబ్బులు జమ అవుతాయన్నారు. కాబట్టి రైతులు అపోహలకు గురికాకుండా ఈ కొనుగోలు కేంద్రాన్ని ఉపయోగించుకోవాలని ఆమె తెలిపారు. ప్రతి రైతు తప్పనిసరిగా ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. అనంతరం ఆమె రైతులతో కలిసి కంది పొలాలను పరిశీలించారు.

పాములపాడులో కంది పంటను పరిశీలిస్తున్న రాష్ట్ర అధికారి శిరీష

అనంతరం ఆమె గ్రామంలోని కంది పంటలను పరిశీలించి దిగుబడి వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల మేనేజర్ ఎంవి సత్యనారాయణ, అసిస్టెంట్ మేనేజర్ దాసరి గంగాధర్, టిఏలు విజయ్, రూప్సీ, వైష్ణవి, ఎన్‌ఫోర్స్‌మెంట్ డిటిలు రాంనారాయణరెడ్డి, డేవిడ్, జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు, మండల వ్యవసాయాధికారి ఎస్‌కె జైనులాబ్దిన్, మాదాలవారిపాలెం సహకార సంఘం అధ్యక్షులు ఆనికాళ్ల ఈశ్వరరెడ్డి, గ్రామ నాయకులు పేరం కోదండ రామిరెడ్డి, వ్యవసాయ సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

శ్రీ ప్రతిభ విద్యార్థుల విజయోత్సాహం

జెఇఇ మెయిన్స్‌లో 'శ్రీ ప్రతిభ' విద్యార్థుల రాణింపు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జెఇఇ మెయిన్స్‌లో శ్రీ ప్రతిభ విద్యా సంస్థల విద్యార్థులు రాణించారు. మ్యాథ్స్‌లో 98.38, 98.25 పర్సంటైలును, 97 పర్సంటైల్ పైన 8 మంది, 96 పర్సంటైల్ పైన 12 మంది సాధించారు. కెమిస్ట్రీలో 97.79, 97.10, ఫిజిక్స్‌లో 96.18 పర్సంటైలును సాధించారు. అన్ని సబ్జెక్టుల్లో పుట్టూరి గోవర్ధన్ 96.47, రావి మహేశ్ చౌదరి 95.73, ఘట్టమనేని మోహిత సాయి 95.50, తోట వెంకట అవినాష్ నాయుడు 92.75, గుండారెడ్డి ప్రియాంక 92.27, సాధించినట్లు శ్రీ ప్రతిభ విద్యాసంస్థల ఛైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు తెలిపారు. ఉత్తమ పర్సంటైల్ సాధించిన విద్యార్థులను శ్రీప్రతిభ విద్యాసంస్థల ఛైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు, వైస్ ఛైర్మన్ నల్లూరి సీతారామాంజనేయులు, సిఇఒ నల్లూరి జయప్రకాశ్ నారాయణ్ అభినందించారు.

'వీరిశెట్టి' విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి-పొదిలి

మంగళవారం విడుదలైన జెఇఇ (ఐఐటి) మెయిన్స్ ఫలితాలలో స్థానిక వీరిశెట్టి జూనియర్ కాలేజీ విద్యార్థిని మద్దుల డింపుల్ 92 శాతం సాధించి పొదిలి పట్టణంలో అత్యధిక పర్సంటైల్ సాధించిన విద్యార్థిగా నిలిచారు. బెల్లంకొండ విద్యాసంస్థలు పొదిలి, పామూరు, సిఎస్ పురం డైరెక్టర్‌గా ఉన్న మద్దుల శ్రీనివాసులు కుమార్తె డింపుల్ ఉత్తమ ప్రతిభ కనబరిచిన సందర్భంగా కళాశాల యాజమాన్యం, సిబ్బంది విద్యార్థినిని అభినందించారు.

డింపుల్

విద్యార్థినిని అభినందిస్తున్న అధ్యాపకులు

డిగ్రీ ఫలితాల్లో 'ప్రభుత్వ' విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి-దర్శి

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ విడుదల చేసిన డిగ్రీ పరీక్షా ఫలితాల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులు బత్తుల రాజ్యలక్ష్మి వృక్షశాస్త్రంలో 90 మార్కులు సాధించి యూనివర్సిటీలో మూడో ర్యాంకు సాధించినట్లు ప్రిన్సిపాల్ సావిత్రి తెలిపారు. ఈ సందర్భంగా ఆమెను అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. అదేవిధంగా పలువురు విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో 8వ తరగతి చదువుతున్న ఆదిత్య అనే విద్యార్థి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక య్యాడు. మంగళవారం ఒంగోలులో జిల్లా స్థాయిలో జరిగిన ఇన్‌స్పైర్ మేనేక్ డిస్ట్రిక్ లెవల్ ఎగ్జిబిషన్, ప్రాజెక్ట్ కాంపిటీషన్ పోటీలలో పాల్గొన్నాడు. ఈ కాంపిటీషన్‌లో జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు 99 ప్రాజెక్టులను ప్రదర్శించారు. వీటిలో ప్రస్తుత సమాజానికి ఉపయోగపడే హ్యాండ్ టాకింగ్ సిస్టం బై యూజింగ్ మెన్స్ టెక్నాలజీ ప్రాజెక్టును ఆదిత్య ప్రదర్శించాడు. ఈ ప్రాజెక్టును రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆదిత్యను సర్టిఫికెట్, మెమెంటో అందజేసి డీఈవో సుభద్ర అభినందించారు. ఆదిత్యను కృష్ణవేణి టాలెంట్ స్కూల్ అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణ అభినందించారు.

సర్టిఫికెట్లు అందజేస్తున్న డిఇఒ సుభద్ర

వైసీపీకి పట్టం కడితేనే భవిష్యత్తు

ప్రజాశక్తి-దర్శి

వచ్చే ఎన్నికల్లో వైసీపీకి పట్టం కడితేనే భవిష్యత్తు ఉంటుందని మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక పట్టణంలోని కురిచేడు రోడ్డులోని కోతమిషన్ బజారు, శివరాజ్‌నగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా కురిచేడు రోడ్డులోని ఆంజనేయ స్వామి గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఛైర్మన్ వెంకాయమ్మతో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బూచేపల్లి మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వస్తేనే అభివృద్ధి, సంక్షేమం ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా మహిళలు ఆయనకు హారతులు పట్టి స్వాగతం పలికారు. మండల పార్టీ అధ్యక్షులు వెంకటరెడ్డి, కార్పొరేషన్ డైరక్టర్లు ఎస్ఎం బాషా, కుమ్మిత అంజిరెడ్డి, సోము దుర్గారెడ్డి, పట్టణ అధ్యక్షులు హరీష్, నాయకులు రెహమాన్, రవి, సుబ్బారెడ్డి, శ్రీనివాసరెడ్డి, గురవారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రచారంలో బూచేపల్లి

రైతులతో శాస్త్రవేత్తల ముఖాముఖి

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

రైతులు శాస్త్రవేత్తల సలహాలు పాటించి సుస్థిర వ్యవసాయం చేయాలని ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె అన్నపూర్ణ అన్నారు. మంగళవారం స్థానిక విశ్రాంతి ఉద్యోగుల భవనంలో మార్కాపురం సబ్ డివిజన్‌కు సంబంధించిన ఐదు మండలాలు మార్కాపురం, తర్లుపాడు, కంభం, అర్ధవీడు, పెద్దారవీడు రైతులకు వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలతో ముఖాముఖి కార్యక్రమాన్ని ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీమతి కె అన్నపూర్ణ పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కె అన్నపూర్ణ మాట్లాడుతూ రైతులు పండించే పంటలలో వచ్చే సమస్యల గురించి వివరించారు. దర్శి వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త ఎల్ రాజేష్ చౌదరి రైతులు అడిగిన సమస్యలపై సమాధానాలిచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు, సిహెచ్ రమాదేవి, తర్లుపాడు, కంభం, పెద్దారవీడు వ్యవసాయ అధికారులు, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారులు, ఐదు మండలాల రైతులు పాల్గొన్నారు.

సహాయ నిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి పట్టణంలోని వైసిపి కార్యాలయంలో మంగళవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కనిగిరి నియోజకవర్గం వైసీపీ ఇన్‌ఛార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ పంపిణీ చేశారు. కృష్ణమాచారికి రూ.70,000, మూలే కోటయ్యకు రూ.1,20,000, సగిటి ఈశ్వరమ్మకు రూ.1,20,000 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు రాగా అందజేశారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి దద్దాల నారాయణ యాదవ్ మాట్లాడుతూ పేద, బడుగు బలహీన వర్గాల ప్రభుత్వం జగనన్న ప్రభుత్వం అని అన్నారు. ప్రజలందరూ జగనన్నకు 2024వ సార్వత్రిక ఎన్నికల్లో బ్రహ్మరథం పడతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ అబ్దుల్ గఫార్, పిడిసిసి బ్యాంక్ ఛైర్మన్ ప్రసాద్ రెడ్డి, విజిలెన్స్ కమిటీ సభ్యులు, కనిగిరి జెడ్పిటిసి కస్తూరిరెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ మాణిక్యరావు, పీసీ పల్లి ఎంపీపీ ఆవన్న పీసీపల్లి జడ్పిటిసి ఒకే రెడ్డి, పిసిపల్లి మండల పార్టీ అధ్యక్షులు బొర్రారెడ్డి, వైసీపీ ఎస్సీ నాయకులు కల్వకుర్తి చంద్ర, మండాది కృష్ణారెడ్డి, దామిరెడ్డి నాగేంద్రారెడ్డి, భూమిరెడ్డి కొండారెడ్డి, లక్కిరెడ్డి హనుమారెడ్డి, పోతు రమణారెడ్డి, కనిగిరి నియోజకవర్గం ప్రచార కమిటీ అధ్యక్షులు దాదిరెడ్డి మాలకొండారెడ్డి, ములే గోపాల్‌రెడ్డి, వైసీపీ నాయకులు కటికల వెంకటరత్నం, కమతం రమణారెడ్డి, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

చెక్కులు పంపిణీ చేస్తున్న వైసీపీ ఇన్‌ఛార్జి దద్దాల

లేగ దూడలతో ఆర్థికాభివృద్ధి

ప్రజాశక్తి-సంతనూతలపాడు

లేగదూడలను సంరక్షించడం ద్వారా రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి డాక్టర్ బేబీరాణి అన్నారు. మండలంలోని ఎం వేములపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని మట్టిపాడులో మంగళవారం పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మేలు జాతి లేగదూడల ప్రదర్శన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ బేబీరాణి మాట్లాడుతూ రైతులు సరిపడా పాలు అందజేస్తే దూడల మరణ శాతాన్ని తగ్గించవచ్చునన్నారు. పశుగణాభివృద్ధి సంస్థ ఒంగోలు సహాయ సంచాలకులు డాక్టర్ షేక్ కాలేషా మాట్లాడుతూ గర్భధారణ ద్వారా లేగ దూడల ఉత్పత్తిపై దృష్టి సారిస్తే రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారన్నారు. సెక్స్ సార్టెడ్ సెమన్ పథకాన్ని రైతులు ఉపయోగించుకోవాలని సూచించారు. అనంతరం లేగ దూడలకు నట్టల నివారణ మందులను తాగించారు. ఈ సందర్భంగా అందమైన లేగదూడల యజమానులు ముగ్గురికి బహుమతులుగా పాలక్యాన్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారులు డాక్టర్ కృపారావు, డాక్టర్ బి ప్రతాప్‌రెడ్డి, గ్రామ సర్పంచి ఈర్ల విజయలక్ష్మి, గ్రామ నాయకులు మండవ వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బహుమతులను అందజేస్తున్న డాక్టర్ బేబీరాణి

జనరల్ నాలెడ్జ్‌లో మొదటి స్థానం

ప్రజాశక్తి-దర్శి

తాళ్లూరు మండలం నాగంబొట్లపాలెం విద్యార్థి షేక్ మహబూబ్ ఫరూక్ జనరల్ నాలెడ్జ్‌లో మండల స్థాయిలో మొదటి స్థానంలో వచ్చినట్లు ప్రధానోపాధ్యాయు రాలు అంజలి తెలిపారు. విద్యార్థి బాగా రాణించాలని ఆకాంక్షించారు. విద్యార్థు లు, ఉపాధ్యాయులు అభినం దించారు.

కాపు సంక్షేమ సేన అధ్యక్షురాలిగా లక్ష్మి

ప్రజాశక్తి-కురిచేడు

కాపు సంక్షేమ సేన దర్శి నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలిగా కురిచేడుకు చెందిన లక్ష్మిని నియమిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కరణం నూకరత్న కళావతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు కాపు సంక్షేమసేన దర్శి నియోజకవర్గ కార్యక్రమాలలో జనసేన పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలకు అనుగుణంగా వ్యవహరిస్తానని, పవన్ కళ్యాణ్‌ను ముఖ్యమంత్రిగా చేసేంతవరకు చిత్తశుద్ధితో అనునిత్యం పనిచేస్తానని తెలిపారు.

మహిళలకు ఉచిత కుట్టు మిషన్ శిక్షణ: డాక్టర్ ఉగ్ర

ప్రజాశక్తి-కనిగిరి: మహిళలకు జీవనోపాధి కల్పించేందుకు జనని చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో త్వరలో కుట్టు మిషన్ శిక్షణ ఇస్తామని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ కనిగిరి ఇన్‌ఛార్జి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. మంగళవారం అమరావతి గ్రౌండ్స్‌లో కుట్టు మిషన్ శిక్షణ కోసం వచ్చిన మహిళలకు జరిగిన అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడారు. మహశక్తి కార్యాలయంలో ఈ శిక్షణ జరుగుతుందని ఆయన తెలిపారు. మొదటి విడతగా వితంతువులు, ఒంటరి మహిళలకు ఈ శిక్షణ ఉంటుందన్నారు. తరువాత అనాథలు, పేద మహిళలకు శిక్షణ ఇస్తామని తెలిపారు.

ఆ రోడ్డులో ప్రయాణం ప్రాణసంకటం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ఆ రోడ్డులో నిరంతరం వాహనాలు పంట పొలాలకు, సమీప కాలనీకి ప్రయాణిస్తూ ఉంటాయి. ప్రక్కనే సాగునీటి కాలువ ఉంటుంది. ప్రయాణం చేసి రహదారికి మార్జిన్ లేక కాలువలోకి కోతకు గుర్రై రహదారికి చేరుకుంది. దీంతో కాలువ ఉధృతంగా ప్రవహించే సమయంలో నీరు రహదారిని తాకుతుంది. భట్టిప్రోలు పాత మండల కార్యాలయం వద్ద బాల సౌరి కాలనీ మీదుగా పంట పొలాలకు వెళ్లే రహదారి దుస్థితి ఇది. ఎన్నో ఏళ్లుగా ఈ రహదారి కాలువ కట్ట కోతకు గుర్రై ప్రమాద భరితంగా మారినప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆ ప్రాంత రైతులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వందల

మార్జిన్ లేని సిసి రోడ్డు

ఎకరాల పంట ఉత్పత్తులు ఈ రహదారి గుండానే రైతులు తరలించాల్సి ఉంది. వరి గడ్డి, ధాన్యం బస్తాలు తరలించడమే కాక నిత్యం రైతులు, కూలీలు పంట పొలాలకు వెళ్లాల్సి ఉంది. బాలసౌరి నగర్ మాత్రమే కాక జగనన్న కాలనీకి కూడా ఈ రహదారి ద్వారానే ప్రజలు తిరుగుతూ ఉంటారు. వరి పంట సాగు సమయంలో దమ్ము చక్రాలతో కూడిన డాక్టర్లు కూడా ఈ రహదారిపై ప్రయాణిస్తుండటంతో మార్జిన్ లేక పోవటంతో టాక్టర్లు ఎక్కడ జారి కాలవ లోకి వెళతావునని భయోందోళకు గురవుతూ ఉంటామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారి మార్జిన్ జారిపోయిన కాలువ ప్రాంతంలో అడివిట్మెంట్ ఏర్పాటు చేయాలని అనేకమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం కాలువలో సాగునీరు లేనందున ఖరీఫ్ ప్రారంభానికి ముందు కాలువ నీటి విడుదల సమయానికి ఈ రహదారి మార్జిన్‌కు తగిన చర్యలు కోరుతున్నారు.

మాట్లాడుతున్న వామపక్ష నాయకులు

16న గ్రామీణ భారత్ సమ్మె

ప్రజాశక్తి - భట్టిప్రోలు

రైతు, కార్మిక విధానాలకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధాలను నిరసిస్తూ ఈనెల 16న దేశవ్యాప్తంగా చేపట్టిన సమ్మెను విజయవంతం చేయాలని వాపక్ష పార్టీల నేతలు కోరారు. స్థానిక ఏఐటియుసి కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో నాయకులు మురుగుడు సత్యనారాయణ, గొట్టుముక్కల బాలాజీ, మర్రివాడ వెంకటరావు మాట్లాడారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేయటం, రైతులకు మద్దతు ధర లేకుండా నిర్వీర్యం చేయటం, కార్మికులకు ఉపాధి అందకపోవడం వంటి సమస్యలపై జరిగే సమ్మె, గ్రామీణ బంధు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జి నాగరాజు, పి మనోజ్, గొంతు శ్రీనివాసరావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్ర భవిష్యత్తు

ప్రజాశక్తి - రేపల్లె

రానున్న ఎన్నికల్లో టిడిపిని గెలిపించటమే ధ్యేయంగా పని చేస్తున్నట్లు టీడీపీ పట్టణ అధ్యక్షులు గోగినేని పట్టాభి రామారావు అన్నారు. పట్టణంలోని 2వ వార్డులో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టీడీపీ అధికారంలోకి రావాలన్నారు. ఇంటింటికీ వెళ్లి మినీ మ్యానిఫెస్టో వివరాలను చెప్పారు. రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపేందుకు, ప్రజల కష్టాలు, బాధలు, సమస్యలు దృష్టిలో పెట్టుకుని టిడిపి ప్రణాళిక ప్రకటించిందని అన్నారు. కార్యక్రంలో టీడీపీ జనసేన పట్టణ అధ్యక్షులు రాసంశెట్టి మహేష్, ఆలూరి సురేష్, ఆలూరి దానియేలు, పరిశా పవన్ కళ్యాణ్, దేవగిరి రవిశంకర్ పాల్గొన్నారు.

సెప్టిక్ ట్యాంకు నిర్మించాలి

ప్రజాశక్తి - చిన్నగంజాం

నాడు నేడు పనులు కింద జెడ్‌పి హై స్కూల్ నందు సెప్టిక్ ట్యాంక్ నిర్మించాలని గ్రామదర్శినిలో అధికారులను ఉపాధ్యాయులు కోరారు. మండలంలోని కడకుదురులో గ్రామదర్శిని క్రింద జెడ్‌పి సీఈఒ జాలిరెడ్డి సందర్శించారు. కలెక్టర్ రంజిత్ భాషా ఆదేశాల మేరకు గ్రామదర్శిని జరుగుతున్నట్లు చెప్పారు. జెడ్‌పి హై స్కూల్, అంగనవాడి, హెల్త్ క్లినిక్, జగనన్న లే అవుట్ సందర్శించినట్లు తెలిపారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను కలెక్టర్‌కు నివేదించనున్నట్లు చెప్పారు. సమస్యలను గుర్తించి సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఆశాది బ్రహ్మారెడ్డి, కడకుదురు సర్పంచి శివకుమారి, వైసిపి నాయకులు రామకృష్ణారెడ్డి, ఎంపీడీఒ వరప్రసాద్, ఈఓఆర్డి ఎన్‌విజికె మూర్తి, పంచాయతీ కార్యదర్శి ఎన్ సూర్యనారాయణ, డాక్టర్ కీర్తి సరోజ్, విద్యుత్ శాఖ నారాయణ పాల్గొన్నారు.

లేగదూడల సంరక్షణపై అవగాహన

ప్రజాశక్తి - నిజాంపట్నం

లేగదూడల సంరక్షణ పట్ల రైతులు అవగాహన కలిగి ఉండాలని పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి డాక్టర్ హనుమంతావు అన్నారు. మండలంలోని కూచినపూడి పశు వైద్యశాల అవరణలో నిర్వహించిన లేగదూడల ప్రదర్శనలో ఆయన మాట్లాడారు. అందాల లేగ దూడల రైతులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఎద ఇంజక్షన్ ద్వారా పుట్టే దూడల్లో 50శాతం మగధూడలు, 50శాతం ఆడ దూడలు ఉంటున్నాయని అన్నారు. దీంతో పశువుల జాతి సంతతి అభివృద్ధి చెందడం లేదనే ఉద్దేశంతో కేవలం ఆడ దూడలు పుట్టే విధంగా ఎద ఇంజక్షన్లను రైతులకు సబ్సిడీపై చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తెనాలి డిడి వై కేదారేశ్వరరావు, ఏడిలు నరేంద్రబాబు, నాగేశ్వరరావు, పశు వైద్యులు హేమ ప్రియ, ప్రవీణ్ కుమార్, మీనాక్షి దేవి, రంజిత, రోషన్ బేగ్, సర్పంచ్ రాజేశ్వరి రామారావు పాల్గొన్నారు.

జెఇఇ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

విద్యాధర్‌రెడ్డి

వేణువర్ధన్‌రెడ్డి

రోహిత్

జెఇఇ మెయిన్స్ ఫలితాల్లో మండలంలోని పూసపాడు డ్రీమ్జ్ జూనియర్ కళాశాల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని కళాశాల కరస్పాండెంట్ పేర్ని సతీష్ చంద్ర తెలిపారు. బద్దిగం విద్యాధర్‌రెడ్డి 98.49శాతం, కాసు వేణు వర్ధన్‌రెడ్డి 97.92శాతం, తగిరిస రోహిత్ 96.62శాతం, మందారపు సంజన్ 94.86 శాతం, పులి మౌనిక 94.09 శాతం, రావి సిరి చౌదరి 93.84 శాతం, తిరుమలశెట్టి సాయి చంద్రిక 93.33 శాతం, షేక్ సైదా వలి 91.26 శాతం, కటికి ఆకాష్ 90.94 శాతం, పూల సుభాషిణి 90.69 శాతం సాధించారని అన్నారు. కళాశాల ఏర్పాటు చేసిన అనతి కాలంలోనే ఇంతటి ఘన విజయాలను సాధించటం పట్ల అధ్యాపక బృందానికి అభినందనలు తెలిపారు. విద్యార్థులను, తల్లిదండ్రులను డ్రీమ్జ్ అధినేత పేర్నిరాధా

బహిరంగ సభను విజయవంతం చేయాలి

అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్

ప్రజాశక్తి - బల్లికురవ రూరల్

మండలంలోని ఎస్ఎల్ గుడిపాడు టిడిపి శ్రేణులు మంగళవారం ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్‌ను సంతమాగులూరు అతిథి గృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. చంద్రబాబు రా..కదలిరా..! సభ ఈనెల 17న ఇంకొల్లులో విజయవంతం చేసేందుకు కృషి చేయాలని కోరారు. రాష్ట్రంలో వైసీపీ పీడిత వర్గాలను ఏకం చేసి, వైసిపి దుశ్చర్యలను ప్రజల్లోకి తీసుకుని వెళ్ళడానికి, వైసీపీ బాధిత వర్గాలన్నిటినీ ఏకంచేసి టిడిపి, జనసేన అధికారంలోకి వస్తే న్యాయం జరుగుతుందని ఎంఎల్ఏ

మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్

గొట్టిపాటి రవికుమార్ అన్నారు. రాష్ట్రంలో వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు బాధితులేనని అన్నారు. జగన్ ఇచ్చిన హామీలన్నీ గాలికి వదిలేశారని అన్నారు. అన్నీ ధరలు, చార్జీలు పెంచేశాడరని అన్నారు.

వెటర్నరీ అసిస్టెంట్‌ను నియమించాలి

గ్రామదర్శినిలో పాపాయిపాలెం గ్రామస్తుల వినతి

ప్రజాశక్తి - వేటపాలెం

పశు సంపద మీద జీవనం కొనసాగించే తమ గ్రామానికి వెటర్నరీ హాస్పటల్ కానీ, వెటర్నరీ అసిస్టెంట్ గాని కేటాయించాలని పాపాయిపాలెం గ్రామస్తులు కోరారు. మండలంలోని పాపాయిపాలెంలో మంగళవారం గ్రామదర్శిని నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్‌పి డిప్యూటీ సీఈఓ డి హనుమంతరావు ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా హెల్త్ క్లినిక్, రైతు భరోసా కేంద్రం, అంగనవాడి సెంటర్, సచివాలయం రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం

మాట్లాడుతున్న జెడ్‌పి డిప్యూటీ సిఇఒ హనుమంతరావు

చేశారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి విశ్వనాథం, పంచాయతీ కార్యదర్శి పరణం పూర్ణ కమారి, ఎంపీడీఒ ఆఫీస్ సూపరింటెంట్ ఎంవిఎస్ శర్మ పాల్గొన్నారు.

హనిమిరెడ్డికి మద్దతుగా ఆటో ర్యాలీ

ప్రజాశక్తి - అద్దంకి

వైసిపికి మద్దతుగా శ్రీ ప్రసన్నాంజనేయ నేస్తం ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆటో ర్యాలీని వైసిపి ఇంఛార్జి పానెం చిన్న హనిమిరెడ్డి, పరిశీలకులు వెంకారెడ్డి మంగళవారం ప్రారంభించారు. బంగ్లా రోడ్డులోని రాజ్యాంగ సృష్టికర్త డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలతో నివాళులు అర్పించారు. అనంతరం ర్యాలీని ప్రారంభించారు. ఆటో యూనియన్ అధ్యక్షుడు నాగిపోగు చక్రవర్తి, ఉపాధ్యక్షుడు దాసరి బుల్లయ్య ఆధ్వర్యంలో ఆటోలు బంగ్లా రోడ్డు నుంచి ర్యాలీగా బయలుదేరి వైసిపి కార్యాలయానికి చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆటో కార్మికులు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో తమ ఆటో వాళ్ళకి

ఆటో ర్యాలీలో వైసిపి ఇన్‌ఛార్జి హనిమిరెడ్డి

ఎంతో లబ్ది చేకూరిందని అన్నారు. ఆటో కార్మికులకు ఆర్థిక సహాయం చేసిన ఘనత సిఎం జగన్మోహన్‌రెడ్డిదేనని అన్నారు. రాబోయే ఎన్నికల్లో మళ్ళీ వైఎస్ జగన్మోహన్ రెడ్డిని సిఎంగా, హనిమిరెడ్డిని ఎంఎల్‌ఏగా గెలిపించుకుంటామని పేర్కొన్నారు.

వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న నాగేశ్వరరావు

ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం

ప్రజాశక్తి - చెరుకుపల్లి

ఆరోగ్యమే మహాభాగ్యమని ప్రజలందరి ఆరోగ్య సంరక్షణ కోసం ప్రభుత్వం పలు పథకాల ద్వారా చర్యలు తీసుకుంటుందని సర్పంచి నలిగల నాగేశ్వరరావు అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా మంగళవారం గ్రామంలో ఆరోగ్య సురక్ష నిర్వహించారు. వివిధ రకాలైన జబ్బులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. పేద, బడుగు, బలహీనవర్గాల ప్రజలందరి సంక్షేమమే ధ్యేయంగా సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రారంభించారని అన్నారు. కార్యక్రమంలో బడుగు శ్రీధర్, నాని, పంచాయతీ కార్యదర్శి సురేష్ బాబు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న రోటరీ ప్రతినిధులు

బాధితుడికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - అద్దంకి

ముండ్లమూరు మండలంలోని శంకరాపురం గ్రామానికి చెందిన వెంకటరావు కుమారుడు సత్యనారాయణ ప్రసాద్‌కు బ్లడ్ క్యాన్సర్‌తో బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రిలో వైద్యం చేస్తున్నారు. వైద్యానికి రూ.25లక్షలు అవసరమౌతాయని వైద్యులు చెప్పగా విషయం తెలిసిన వివిధ సంస్థల బాధ్యులు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, మలాది శ్రీనివాసరావు, చుండూరి మురళీసుధాకరరావు, హెచ్‌ఎంలు ఇ అనిత, లక్కరాజు చంద్రశేఖర్, డాక్టర్ యు దేవపాలన, వారణాసి రఘురామశర్మ, చప్పిడి వీరయ్య, కంఠంరాజు శివరామ కోటేశ్వరరావు, లక్కరాజు శ్రీనివాసరావు ఆర్థికంగా సహకరించారు. దాతల ద్వారా వచ్చిన రూ.6500నగదును బాధిత కుటుంబానికి చెందిన ఎం శ్రీనివాసరావుకు సోమవారం సింగరకొండ రోటరీ సంస్థ కార్యాలయంలో అందచేశారు.

16న కార్మిక సమ్మె

ప్రజాశక్తి - పర్చూరు

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 16న జరిగే దేశవ్యాప్త కార్మిక సమ్మె, గ్రామీణ బంధు సందర్భంగా స్థానిక బొమ్మల సెంటర్ వద్ద జరుగు ధర్నా నిర్వహిస్తున్నట్లు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బండి శంకరయ్య తెలిపారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ సంస్థలను ప్రవేటు వ్యక్తులు, సంస్థలకు అమ్మేస్తుందని అన్నారు. దేశీయ వ్యవసాయాన్ని, రైతులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. కార్మిక, రైతు సోదరులు హాజరు కావాలని కోరారు.

డ్వాక్రా మహిళలకు ఆసరా చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - పర్చూరు

మండలంలోని చెరుకూరులో జరిగిన 4వ విడత ఆసరా చెక్కుల పంపిణీలో వైసిపి ఇంచార్జి ఆమంచి కృష్ణమోహన్ డ్వాక్రా మహిళలకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన డ్వాక్రా మహిళ బిళ్ళా సావమ్మ మాట్లాడుతూ తాను మూడు విడతల్లో చేయూత డబ్బులు అందుకొని కూరగాయలు పండించి జీవనం సాగిస్తున్నట్లు చెప్పారు. తాను అనారోగ్యంతో ఏ పని చేయలేక బాధపడుతున్నట్లు తెలిపారు. తమ పిల్లలు బూట్లు తొడుక్కొని, బెల్టు పెట్టుకొని, స్కూల్ బ్యాగుతో ఇంగ్లీషు మీడియం బడికి పోతుంటే ఎంతో ఆనందంతో ఉప్పొంగిపోయే దానినని అన్నారు. తమ పిల్లలు ఇంగ్లీష్ మీడియంలో చదవటానికి తాము ఏ ఉద్యోగం చేస్తున్నామో తెలియక



ఆసరా చెక్కులు అందజేస్తున్న ఆమంచి కృష్ణమోహన్

అప్పుడప్పుడు మురిసిపోయేదానినని అన్నారు. తమ బ్రతుకులు బాగుపడాలంటే మళ్ళీ జగన్మోహన్‌రెడ్డే సీఎం కావాలని ఆమె కన్నీటి పర్యంతమయ్యారు. అనంతరం ఆమంచి కృష్ణమోహన్ మాట్లాడుతూ చంద్రబాబు డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తామని చేయలేదని అన్నారు. జగన్ పాదయాత్రలో మహిళలకు ఇచ్చిన మాటకు కట్టుబడి కరోనా వచ్చిన కూడా రుణమాఫీ చేశారని గుర్తు చేశారు. గత పాలకులకు ఇప్పటి పాలకులకు ఎంత తేడా ఉందో ఆత్మ పరిశీలన చేసుకోవాలని మహిళలను కోరారు. వాలంటీర్ల వ్యవస్థ ద్వారా విప్లవాత్మక మార్పులు తెచ్చిన ఘనత జగన్మోహన్‌రెడ్డిదని అన్నారు. కార్యక్రమంలో ఎపిఎం లాజరు, గాదె సురేష్, ముప్పాళ్ళ రాఘవయ్య, కటారి అప్పారావు, చెరుకూరు సర్పంచ్ సుబ్బారావు, ఈఓ సత్యనారాయణ, జంగా అనిల్, కోట శ్రీనివాసరావు, జూపూడి రోశయ్య, వైస్ ఎంపీపీ పాలేరు వీరయ్య, మల్ల శ్రీనివాసరావు, ఈఓఆర్డి రామకృష్ణ, నూతలపాటి బలరాం, లంకా శివ, కె రవీంద్ర బాబు, దాసి రవీంద్ర పాల్గొన్నారు.

కవితల పోటీలకు ఆహ్వానం

ప్రజాశక్తి - బాపట్ల

అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవాన్ని ఈనెల 21న పట్టణంలో రోటరీ కళ్యాణ మండపంలో కవితల పోటీలు నిర్వహిస్తున్నట్లు రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు తిమ్మన శ్యామ్ సుందర్, ప్రధాన కార్యదర్శి నందిరాజు విజయ కుమార్ మంగళవారం తెలిపారు. రచయితల సంఘం, రోటరీ క్లబ్, బత్తుల బ్రహ్మారెడ్డి ట్రస్ట్ సంయుక్తంగా నిర్వహిస్తున్న మాతృభాషా దినోత్సవ సందర్భంగా తెలుగు సాహిత్య రంగానికి విశేష సేవలందించిన నారాయణం శేషుబాబు, అబ్దుల్ హఫీజ్, వంగర శ్రీధర్ లను కర్లపాలెం మండలం బుద్ధాంకు చెందిన పెన్మెత్స నాగరాజు సౌజన్యంతో ప్రముఖ కవి దివంగత పెన్మెత్స శ్రీరామరాజు సాహిత్య పురస్కారాలతో సత్కరించనున్నట్లు తెలిపారు. తెలుగు భాషాభివృద్ధి లక్ష్యంతో రాష్ట్రస్థాయి వచన కవితల పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రథమ బహుమతి రూ.1,116, ద్వితీయ, తృతీయ బహుమతి రూ.516తోపాటు మొమెంటోలను బహుకరించనున్నట్లు తెలిపారు. కవితలు ఈ నెల 18లోగా 95027 60757 వాట్స్ యాప్ నెంబరుకు పంపించాలని కోరారు. మాతృభాషా ఔన్నత్యంపై ధవళేశ్వరపు జగదీష్ చే వ్యక్తిత్వ వికాస ప్రసంగం, భాగి కృష్ణమూర్తిచే తెలుగు పద్య గానాలాపన, కామరాజుగడ్డ శ్రీనివాసరావు దర్శకత్వంలో ఎయిమ్ ఫర్ సేవ స్వచ్ఛంద సంస్థ విద్యార్థులచే సందేశాత్మక హాస్య నాటిక ప్రదర్శిస్తారని పేర్కొన్నారు.

తహశీల్దారుగా కృష్ణప్రసాద్

ప్రజాశక్తి - పంగులూరు

నూతన తహశీల్దారుగా జిఎస్ కృష్ణప్రసాద్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బుధవారం ఆయన బాధ్యతలు తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. ఎన్నికల బదిలీల్లో భాగంగా పంగులూరు తహశీల్దారుగా పనిచేస్తున్న ఐ పద్మావతి మచిలీపట్నం స్పెషల్ డిప్యూటీ కలెక్టరుగా బదిలీపై వెళ్లారు. ఆమె స్థానంలో గుంటూరు జిల్లా కొల్లూరు తహశీల్దారుగా పనిచేస్తున్న ఎ శ్రీనివాసరావును బదిలీ చేశారు. అయితే అనివార్య కారణాల వల్ల ఆయన ఇక్కడ జాయిన్ కాలేదు. తరువాత మరో ఇద్దరు తహశీల్దార్లు కూడా ఇక్కడకు రావాల్సి ఉన్నా రాలేదు. దీంతో గత 10రోజులుగా ఇక్కడ పోస్ట్ ఖాళీగా ఉంది. ఇక్కడ డిప్యూటీ తహశీల్దారుగా పనిచేసే భాగ్యరాజ్ ఇంచార్జ్ తహశీల్దారుగా పనిచేస్తున్నాడు. ఇపుడు విజిలెన్స్ తహశీల్దారుగా పనిచేస్తున్న కృష్ణప్రసాదును నియమిస్తూ ఉత్తర్వులు వచ్చాయి.

వెంకటేశ్వరరెడ్డి సేవలు మరువలేని

ప్రజాశక్తి - చీరాల

పట్టణంలోని విటల్‌నగర్‌లోని ఎస్‌వి ఆర్ఆర్ఎం ఉన్నత పాఠశాల వ్యవస్థాపకులు ఆరె వెంకటేశ్వర్‌రెడ్డి 14వ వర్ధంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు.

నివాళి అర్పిస్తున్న టీచర్స్

పాఠశాల కరస్పాండెంట్ గిరిధర గోపాలకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు, ఆయన సతీమణి ఆరె అంజమ్మ మాట్లాడారు. పాఠశాల నిర్వహణకు జీవితాన్ని అంకితం చేశారని, అభివృద్ధికి కృషి చేశారని అన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కె వీరాంజనేయులు, హెచ్ఎం అంజిరెడ్డి, ఉపాధ్యాయులు టి నాగేశ్వరావు పాల్గొన్నారు.

పెట్రోల్ కొట్టించుకొని పరారీ

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

నంబర్ ప్లేట్ లేని కారులో పెట్రోల్ బంక్‌లోకి వచ్చిన వ్యక్తి ట్యాంక్ ఫుల్ చేయించుకొని బిల్ చెల్లించకుండా ఒక్క ఉదుటున ఉడాయించిన ఘటన భారత్ పెట్రోల్ బంకులో చోటుచేసుకుంది. మహీంద్రా కంపెనీకి చెందిన నంబర్ ప్లేట్ లేని ఎస్‌యువి రెడ్ కలర్ కారులో ఓ వ్యక్తి సాయంత్రం 4.30 సమయంలో పెట్రోల్ బంకులోకి వచ్చాడని బంకు సిబ్బంది చెబుతున్నారు. పెట్రోల్ ట్యాంక్ ఫుల్ చేయమని విధుల్లో ఉన్న సిబ్బందిని కోరడంతో దుద్దు చిన్న మీటర్ రూ.5500లకు పెట్రోల్ కొట్టి ట్యాంక్ మూత పెట్టి బిల్ చెల్లించమని కారు దగ్గరకు వచ్చి డ్రైవింగ్ సీటులో ఉన్న గుర్తు తెలియని వ్యక్తిని అడిగాడు. కార్డు తీసి స్వైప్ మిషన్ తెమ్మని చెప్పడంతో మీటర్ ప్రక్కనే ఉన్న మెషిన్ తెచ్చేలోపే ఒక్క సారిగా కారుని వేగంగా పోనిచ్చి అక్కడి నుండి ఒంగోలు వైపు పరారయ్యాడని తెలిపారు. దీంతో ఉలిక్కిపడ్డ పెట్రోల్ బంక్ సిబ్బంది షేక్ పీర్ సాహెబ్, పల్లెపోగు కోటి, కోటేశ్వరరావు ద్విచక్ర వాహనాలతో వెంబడించినప్పటికీ కారు ఆచూకీ లభించలేదని తెలిపారు. దీంతో సిబ్బంది మార్టూరు అర్బన్ సిఐ ఎస్‌వి రాజశేఖరరెడ్డికి ఫిర్యాదు చేశారు. గతంలో కూడా ఇదే తరహాలో రెండు సార్లు గుర్తు తెలియని దుండగులు పెట్రోల్ పోయించుకొని అక్కడి నుండి పరారైనట్లు బాధితులు వాపోతున్నారు. పోలీసులు సిసి కెమెరా ఫుటేజ్ పరిశీలించి ఇటువంటి నేరాలకు పాల్పడుతున్న దుండగులను కఠినంగా శిక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

పంటలను పరిశీలించిన విదేశీ బృందం

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలు ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరమని రాష్ట్ర అధికారి టి విజయ కుమార్ అన్నారు. మండలంలోని కోలలపూడిలో జపాన్ దేశానికి చెందిన స్టీఫెన్ కూచో, మాథ్యుస్ బస్టల్లియం, జకో నదోల్, స్కిలా జాకబ్ బృందం పంటలను మంగళవారం పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయంలో అమృతాలు, కాషాయల తయారీ, జీవమృతం తయారీకి అవసరం అయ్యే పదార్థాలు, వాటి వల్ల ఉపయోగాలను ప్రత్యక్షంగా చూసి తెలుసుకొన్నారు. పండిన పంటల దిగుబడి, మార్కెట్ రవాణా సౌకర్యాలు రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ పంటలను ఆహారంగా తీసుకున్న వారు ఆరోగ్యంగా ఉంటారని జర్మనీ బృందానికి వివరించారు. రైతు బలగాని వెంకటస్వామి, మహిళా రైతు కోటేశ్వ

పంటలను పరిశీలిస్తున్న విదేశీ బృంద సభ్యులు

రమ్మకు చెందిన పంటలను బృందం పరిశీలించి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా అధికారి ఎస్ వాణిశ్రీ, సర్పంచ్ మోరపాకుల సతీష్ కుమార్, ఏడిఏ, సిడిపిఎం, బాపట్ల ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ రహదారుల వెంట ఫ్లెక్సీలు నిషేధం

ప్రజాశక్తి - బాపట్ల

రహదారి ప్రమాదాల నివారణకు జాతీయ రహదారుల వెంట ఫ్లెక్సీలు, సైన్ బోర్డులు ఏర్పాటును నిషేధించినట్లు రవాణా శాఖ జిల్లా అధికారి ఆర్ సురేష్ తెలిపారు. 35వ రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా రహదారి ప్రమాదాల నివారణపై జిల్లా కార్యాలయంలో జాతీయ, రాష్ట్రీయ సాంకేతిక అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కొమ్మలపాడు గ్రామం వద్ద అనధికారికంగా వాహనాలను నిలుపుదల చేస్తున్నారని అన్నారు. పుట్టావారిపాలెం గ్రామ కూడలి, సంతమాగులూరు అడ్డ రోడ్ వద్ద దుకాణాలతో రహదారి ఆక్రమణలకు గురైందని అన్నారు. సమావేశంలో ఎంవిఐలు బి రామకృష్ణారెడ్డి, పి అంకమ్మరావు, బి కిషోర్,

రహదారి ప్రమాదాల నివారణపై సమీక్ష

రహదారి భద్రత అధికారి నరేష్, పిఎల్ నారాయణ, ఆర్ అండ్ బి అధికారులు షేక్ ఖాదర్ నవాజ్, ఏ సుధీర్, జాతీయ రహదారి నిర్వహణ అధికారి పి వెంకటదీపక్, నామ్, చిరంజీవి, ప్లాజా మేనేజర్, ఎక్స్ ప్రెస్ వే లిమిటెడ్ అధికారులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన

ప్రజాశక్తి - పంగులూరు

మండలంలోని ప్రధాన కూడలిలో ఓటు హక్కుపై రేణింగవరం ఎస్ఐ కెకె తిరుపతిరావు అవగాహన కల్పించారు. ఓటు హక్కు అనేది భారత రాజ్యాంగం ప్రతి ఒక్కరికి ఇచ్చిన హక్కని అన్నారు. దుర్వినియోగం చేసుకోకుండదని అన్నారు. ప్రలోభాలకు లోను కాకుండా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ మోషే, మండల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ రాయిని వెంకట సుబ్బారావు, నాయకులు చిలుకూరి సాంబశివరావు, గొట్టిపాటి కాజా, తిరుపతయ్య పాల్గొన్నారు.

కరణం బలరామకృష్ణమూర్తిని సత్కరిస్తున్న ఆర్యవైశ్యులు

ఎమ్మెల్యే బలరాంకు సత్కారం

ప్రజాశక్తి - అద్దంకి

పట్టణంలోని వాసవి కళ్యాణ మండపం నందు వైసిపి ఆర్యవైశ్య ఆత్మీయ సమావేశం ఈ నెల 18న రాత్రి ఏడు గంటలకు నిర్వహించనున్నారు. ఈసందర్భంగా సింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ కోట శ్రీనివాస కుమార్ పలువురు ఆర్యవైశ్య ప్రముఖులతో చీరాల ఎమ్మెల్యే కరణం బలరామ కృష్ణమూర్తిని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఆర్యవైశ్య ఆత్మీయ సమావేశానికి ఆహ్వానించారు. కార్యక్రమంలో దేవస్థానం మాజీ చైర్మన్ చిన్ని శ్రీమన్నారాయణ, వైసిపి కౌన్సిలర్ గుంటూరు మాధవరావు, ఉడత సురేష్, మద్ది లక్ష్మణ, నల్లమల్లి సుబ్రహ్మణ్యం, కూరపాటి రామకోటేశ్వరరావు, చిలకల సుబ్బారావు, చిన్ని శివ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న జనసేన పార్టీ నాయకులు

పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - రేపల్లె

జనసేన పార్టీ నియోజకవర్గ నూతన కార్యాలయం ఈ నెల 18న ప్రారంభిస్తున్నట్లు ఆ పార్టీ పట్టణ అధ్యక్షులు రాసంశెట్టి మహేష్ తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వర రావు, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శాసన సభ్యులు అనగాని సత్య ప్రసాద్ హాజరౌతారని తెలిపారు. జనసేన జెండాల ఆవిష్కరణ, ర్యాలీలు చేయనున్నట్లు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు. పార్టీ కార్యాలయ గోడ పత్రిక ఆవిష్కరించారు.

రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బలరాం

రోడ్ల పనులు పరిశీలన

మండలంలోని ఈపూరుపాలెం ప్రధాన రహదారి మరమత్తులకు గురై వాహన దారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్న తరుణంలో రహదారిని అధికారులతో కలిసి ఎమ్మెల్యే కరణం బలరామ కృష్ణమూర్తి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్ల మరమ్మత్తులు త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశం. ఆయన వెంట బిట్రా శ్రీనివాసరావు, నాదెండ్ల కోటేశ్వరరావు, షేక్ మస్తాన్, మునిసిపల్ డిఈ ఐసయ్య, ఆర్ అండ్ బి డిఈ నరసింహులు, ఎఈలు పాల్గొన్నారు.

29న మహాజన సభ

ప్రజాశక్తి - బాపట్ల

పట్టణంలోని దగ్గుమల్లి వారిపాలెం ఆది ఆంధ్ర సొసైటీ కోఆపరేటివ్ కలెక్టివ్ ఫార్మింగ్ సొసైటీ మహాజన సభ ఈనెల 29న జరుగుతుందని సొసైటీ అధ్యక్షులు జి విజయ డేవిడ్ రాజు మంగళవారం తెలిపారు.

పంటలను పరిశీలించిన జర్మనీ బృందం

కొత్తపట్నం : కొత్తపట్నం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేసిన వేరుశనగ పంటను రైతు సాధికార సంస్థ ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ ప్రభుత్వ సలహాదారు టి.విజయ కుమార్ (విశ్రాంత ఐఎఎస్ అధికారి) జర్మనీ చెందికి కెఎఫ్‌డబ్ల్యు అభివద్ధి బ్యాంక్ టీం సభ్యులు మంగళవారం పరిశీలించారు. పురిని మల్లేశ్వరమ్మ అనే రైతు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగుచేసిన వేరుశనగ పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం, రసానియక వ్యవసాయ పద్ధుతుల్లో సాగుచేసిన పంటల మధ్య తేడాను గమనించారు. అనంతరం మహిళ సంఘాల తో సమావేశం నిర్వహించారు. మహిళ సంఘాల ద్వారా సాగు చేస్తున్న పకతి వ్యవసాయం, ప్రకతి వ్యవసాయంలో వారి పాత్ర గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జర్మనీ బందం స్టీఫెన్, మత్తయి, యోర్గే, ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ సుభాషిణి, ప్రకతి వ్యవసాయ విభాగం రాష్ట్ర కార్యాలయ అధికారి శ్రీనివాసరావు , వెంకటరావు ,సత్య నారాయణ, ఎఒ మోహన్ రెడ్డి, ప్రకతి వ్యవసాయ సిబ్బంది, మహిళ సంఘాల సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

జాతీయ మహిళా దినోత్సవం

చీమకుర్తి : మహిళాభివృద్ధిలో భారతీయ సమాజంలోని దురాచారాలకు వ్యతిరేకంగా సరోజినినాయుడు పోషించిన పాత్ర కీలకమైందని పారా స్వచ్ఛంద సంస్థ జిల్లా కోఆర్డినేటర్ ఎన్.శ్రీనివాసమూర్తి తెలిపారు. మండల పరిధిలోని బండ్లమూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ మహిళా దినోత్సవం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సరోజినినాయుడు లాంటి మహిళలను ఆదర్శంగా తీసుకొని మహిళా సాధికారిత కోసం పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పారా టీమ్ సభ్యురాలు అనూరాధ,గైడ్ టీచర్ గంగాధర్ పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం

ప్రజాశక్తి - మద్దిపాడు

జగనన్న ఆరోగ్య సురక్షను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ సుగుణమ్మ తెలిపారు. మండల పరిధిలోని కీర్తిపాడు గ్రామ సచివాలయ పరిధిలోని గాజులపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం లాంటిదన్నారు. అనంతరం రోగులకు మందుల కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్పెషలిస్ట్ డాక్టర్లు పి.సుస్మిత వసంత్, సాధారణ వైద్య నిపుణులు డాక్టర్ బి.రామాంజనేయులు, పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ సుస్మిత, మద్దిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ ఆనందం మోహన్, డాక్టర్ శ్రావణ్ కుమార్, డాక్టర్ వినీలచౌదరి, సచివాలయ సిబ్బంది , ఆశా వర్కర్లు, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఎస్‌డబ్ల్యుపిఎస్ షెడ్ నిర్మాణానికి శంకుస్థాపన

నాగులుప్పలపాడు : నాగులుప్పలపాడు మండలపరిషత్ కార్యాల యం ప్రక్కన ఎస్‌డబ్ల్యుపిఎస్ షెడ్ నిర్మాణానికి ఎంపిపి నలమలపు అంజమ్మ, ఎంపిడిఒ మహాలక్ష్మి,ఇఒ విజయలక్ష్మి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ షెడ్ నిర్మాణం పూర్తయితే గ్రామంలోని తడిచెత్త, పొడిచెత్త వేరుచేసి ఇక్కడి తరలించనున్నట్లు తెలిపారు. చెత్తనుంచి సేంద్రీయ ఎరువును తయారు చేసి రైతులకు విక్రయిస్తే పంచాయతీకి ఆదాయం సమకూరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ రవిబాబు, నాయకులు నలమలపు కష్ణారెడ్డి , ఎంపిటిసి పొద పవన్ , మద్దిసాని నాగేశ్వరావు, తోకల శ్రీను, బాలకష్ణ, పోలినేని కోటేశ్వరావు, గండు వెంకట్రావు, గోపిరెడ్డి ,సుబ్బారావు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో డిఎస్‌పి తనిఖీ

శింగరాయకొండ : శింగరాయకొండ పోలీస్ స్టేషన్‌ను ఒంగోలు డిఎస్‌పి కిషోర్‌బాబు మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేసుల వివరాల గురించి ఆరా తీశారు. కేసుల దర్యాప్తులకు సూచనలు చేశారు. అదేవిధంగా రౌడీ షీటర్ల గురించి తెలుసుకొని సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ టి.శ్రీరామ్, సిఐ దాచేపల్లి రంగనాథ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

టైర్ బంద్‌ను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

మాట్లాడుతున్న గంటెనపల్లి శ్రీనివాసులు

కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన హిట్ అండ్ రన్ చట్టానికి వ్యతిరేకంగా ఈనెల 16న దేశవ్యాప్తంగా నిర వ్రహిస్తున్న టైర్ బంద్‌ను జయప్రదం చేయాలని ఆల్ ఇండియా ట్రాన్‌ఫోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు కోరారు. స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో ఆటో ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ నగర కమిటీ సమావేశం దాసరి రమేష్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ హిట్ అండ్ రన్ చట్టానికి వ్యతిరేకంగా నిర్వహిస్తున్న టైర్ బంద్‌లో వాహన డ్రైవర్లు, యజమానులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ నగర కార్యదర్శి తంబి శ్రీనివాసులు, యూనియన్ నాయకులు సత్యం, ఆనంద్, అంగిరేకుల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా మార్ట్ సందర్శన

ప్రజాశక్తి మద్దిపాడు

మహిళా మార్ట్‌లో పరిశీలిస్తున్న పీడీ వసుంధరాదేవి

మహిళా మార్ట్‌లో అన్ని వస్తువులు అందు బాటులో ఉండేలా చూడాలని, ధర తక్కువగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని డిఆర్‌డిఎ, వైఎస్సార్ క్రాంతి పథం ప్రాజెక్టు డైరెక్టర్ వసుంధరాదేవి తెలిపారు. మద్దిపాడు లోని మహిళా మార్ట్‌ను మంగళవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మార్ట్‌లో రోజు వారీ సేల్స్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. సేల్స్ మెరుగు పరచాలనారు. కనీసం రోజువారీ అమ్మకం రూ.50 వేలు తక్కువ లేకుండా ప్లాన్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం బి.నరేంద్ర కుమార్, సిసిలు మూర్తి, మోహన్ రావు, ప్రేమానందం, మహిళా మార్ట్ సిసి మేరీ కుమారి, సందీప్, మల్లీశ్వరి, అకౌంటెంట్ జి. వెంకట రత్నం , మహిళా మార్ట్ కోశాధికారి రేణుక తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-ఒంగోలుసబర్బన్

ప్రదర్శన నిర్వహిస్తున్న నాయకులు

కేంద్ర బడ్జెట్‌లో స్కీం వర్కర్లకు నిధులు కోతను నిరసిస్తూ ఈనెల 16న నిర్వహిస్తున్న గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం, పట్టణ ఆర్‌పిలు, పిఒ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. మండల కేంద్రాలలో నిర్వహించే నిరసన ప్రదర్శనలలో పాల్గొనాలని ఆయా సంఘాల నాయకులు వై. సత్యవతి, ఈదర అన్నపూర్ణ, ఐ.రాఘవమ్మ, పి.కల్పన, గురునాథం, ఎన్.రాహేలమ్మ, రాజ్యలక్ష్మి, యు.గంగాధర్, మహేష్ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. బంద్, సమ్మెను జయప్రదం చేయాలని కోరారు.

బంద్‌ను జయప్రదం చేయాలని ప్రదర్శన

ఈనెల16న దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న గ్రామీణ బంద్, కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం, ఎఐఎఫ్‌టియు(న్యూ) ప్రకాశం జిల్లా కమిటీల ఆధ్వర్యంలో ఒంగోలులో మంగళవారం ప్రదర్శన నిర్వహించారు. ఈమని పాలెంలోని తరిమెల నాగిరెడ్డి భవన్ నుంచి ప్రారంభమైన ప్రదర్శన పోస్టాఫీసు, చర్చిసెంటర్, ప్రకాశం భవనం మీదుగా నెల్లూరు బస్టాండ్ వరకకూ కొనసాగింది. ఈ కార్యక్రమంలో ఎఐఎఫ్‌టియు నాయకులు కత్తి పేరయ్య, అఖిలభారత కార్మిక సంఘాల సమాఖ్య (న్యూ) కోశాధికారి డివిఎన్.స్వామి, వివిధ సంఘాల నాయకులు ఎస్. లలితకుమారి, ఐ.విజయసారథి, ఎంఎస్. సాయి, సుల్తాన్ బాషా, జయబాబు, వి.శ్రీరాములు, శ్రీను పాల్గొన్నారు.

వంటగది నిర్మాణానికి శంకుస్థాపన

చీమకుర్తి : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వంటగది నిర్మాణానికి పూర్వ విదార్థి చలువాది వెంకటేశ్వరరావు మంగళవారం శంకుస్థాపన చేశారు. నిర్వహించారు. వెంకటేశ్వరరావు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1967-68 పదవ తరగతి చదివాడు. ప్రొఫెసర్‌గా పనిచేస్తూ రిటైర్డు అయ్యారు. తను చదివిన పాఠశాలలో వంటగది నిర్మాణానికి పూనుకున్నారు. జెవివి జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ బి.జవహర్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు పూనుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ డైరక్టర్ చలువాది రమేష్,చలువాది సుబ్బారావు, శివప్రసాదు, కల్యాణ్, ప్రధానోపాధ్యాయులు సుబ్రహ్మణ్యం,అల్లూరి శ్రీను పాల్గొన్నారు.

శంకుస్థాపలో చలువాది వెంకటేశ్వరరావు

సుందరరావుకు ఘన నివాళి

ప్రజాశక్తి-టంగుటూరు

టంగుటూరు మండలం అనంతవరం గ్రామ మాజీ సర్పంచి దివంగత కసుకుర్తి సుందరరావు ఆదర్శనీయులని వైసిపి మండల అధ్యక్షుడు మల్లవరపు రాఘవరెడ్డి తెలిపారు. అనంతవరం గ్రామంలో సుందరరావు ప్రథమ వర్ధంతి సభ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ గ్రామ వైసిపి నాయకుడు ఉప్పలపాటి నరసరాజు చొరవతో రాజకీయ రంగ ప్రవేశం చేసి గ్రామ సర్పంచి గా అత్యధిక మెజారిటీతో సుందరరావు గెలుపొందాడన్నారు. తొలుత సుందరరావు చిత్రపటం వద్ద పూలమాలలతో నివాళలర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వైసిపి కన్వీనర్ ఉప్పలపాటి సుబ్బరాజు, సొసైటీ డైరెక్టర్ ఉప్పలపాటి నాగరాజు, ఎఎంసి డైరెక్టర్ కొమ్ము సురేంద్ర, నాయకుడు కసుకుర్తి రామలింగం పాల్గొన్నారు.

రాష్ట్రానికి పట్టిన శనిని వదిలించేందుకు సిద్ధం

జనసేన పార్టీ నాయకుడు గరికపాటి వెంకట్

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

జగన్ అర్జునుడు, అభిమన్యుడు కాదు బస్మాసురుడు అని, ఆయనొక ఆర్థిక తీవ్రవాది అని దర్శి నియోజకవర్గ జనసేన నాయకులు గరికపాటి వెంకట్ అన్నారు. టిడిపి నాయకులు దామచర్ల జనార్ధన్, నూకసాని బాలాజీ తదితరులను గరికపాటి వెంకట్ ఒంగోలులో మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే పనికి మాలిన ముఖ్యమంత్రి జగన్ అని, రాష్ట్ర ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి అనేది లేకుండా చేశారని తెలిపారు. వైసిపి ప్రభుత్వ హయాంలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ముస్లిం, మైనార్టీలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. జగన్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేసి, వ్యవస్థలన్నింటిని భ్రష్టు పట్టించారన్నారు. ప్రజలపై ఇష్టారీతిన పన్నులు వేస్తూ నడ్డి విరిచారన్నారు. రాష్ట్రానికి పట్టిన శనిని వదిలించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో దర్శి నియోజకవర్గంలో వ్యవహరించాల్సిన వ్యూహంపై దామచర్ల జనార్ధన్, బాలాజీలతో వెంకట్ చర్చించినట్లు తెలిసింది. ఈ సందర్భంగా దర్శి నియోజకవర్గంలో జనసేన వ్యూహంపై ప్రచురించిన బ్రోచర్లను టిడిపి, జనసేన నేతలు ఆవిష్కరించారు.

బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే దామచర్ల

బాలసదన్‌కు కనిగిరి బాలిక

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

తన తల్లి తనకు 14ఏళ్లకే పెళ్లి చేసేందుకు ప్రయ్నతించడంతో కనిగిరి పట్టణానికి చెందిన ఓ బాలిక ఆ చెర నుంచి విముక్తి పొంది ఎట్టకేలకు ఒంగోలులోని బాలసదన్‌కు చేరింది. అందిన వివరాల ప్రకారం... కనిగిరి పట్టణంలోని అర్బన్ కాలనీకి చెందిన 14 ఏళ్ల బాలిక తొమ్మిదో తరగతి చదువుతోంది. బాలిక తల్లి అదే ప్రాంతానికి ఓ బాలుడితో వివాహం జరపాలని నిర్ణయించింది. పెళ్లికి ఒప్పుకోవాలని గత కొంతకాలంగా బాలికను బలవంతం చేస్తుంది. తల్లి వేధింపులు తట్టుకోలేని బాలిక కనిగిరి పట్టణానికి చెందిన స్నేహహస్తం చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు సుధీర్‌బాబు దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లింది. సుధీర్‌బాబు ఈవిషయాన్ని ఒంగోలులోని హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బివి. సాగర్ దృష్టికి తీసుకెళ్లారు. సాగర్ ఈ విషయాన్ని ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు బి.పద్మావతి, కనిగిరి డిఎస్‌పి రామరాజు దృష్టికి తీసుకెళ్లారు. బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు పద్మావతి విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ కనిగిరి ఐసిడిఎస్ అధికారులకు తగు సూచనలు చేశారు. మహిళా శిశు సంక్షేమశాఖ అధికారులు బాలిక తల్లిదండ్రులను పోలీసు స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించారు. బాల్యవివాహం చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాలికకు తన తల్లిదగ్గర ఉండటం ఇష్టం లేకపోవడంతో బాలల సంక్షేమ కమిటీ ఆదేశాల మేరకు ఒంగోలులోని బాలసదన్‌కు తరలించారు. బాలిక తొమ్మిదో తరగతి పరిక్షలకు హాజరై పరిక్షలు రాసేవిధంగా, విద్యను కొనసాగించేందుకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందించాలని బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు పద్మావతి జిల్లా విద్యాశాఖ అధికారికి ఆదేశాలు జారీ చేశారు.